యాదాద్రి లక్ష్మీనర్సింహాస్వామిని వారిని దర్శించుకున్న భాస్కర్‌గౌడ్ దంపతులు

నవతెలంగాణ-రాజపేట

యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి వారిని రాజాపేటకు చెందిన ఉమ్మడి నల్లగొండ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సంధిల భాస్కర్‌గౌడ్ వాణి దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాన ఆలయంలోని స్వయంభుల దర్శనం అష్టోత్తర పూజలు జరిపారు.అనంతరం అర్చకులు వేదఆశీర్వచనం చేశారు.తీర్థ ప్రసాదాలను అందించారు.సంధిల భాస్కర్‌గౌడ్ వాణి దంపతులకు ప్రభుత్వ విప్ గొంగిడిలసునీతమహేందర్‌రెడ్డి, టెస్కాబ్ వైస్‌చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు,ప్రతినిధులు, అన్ని పార్టీల ప్రముఖులు, జర్నలిస్టులు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి

1

సోమవారం 12 జూన్ 2023

ఉష్ణోగ్రతలు

	గరిష్ఠ	కనిష్ఠ
నల్లగొండ	40.0	24.0
సూర్యాపేట	40.9	32.7
యాదాద్రిభువనగిరి	40.8	28.9



బస్టాండ్ కూల్చివేతను అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, అఖిలపక్ష నాయకులు

నవతెలంగాణ- కట్టంగూరు

సుమారు 10 గ్రామాలకు ప్రజల అవసరాల కోసం చెరువు అన్నారం స్టేజి వద్ద బస్టాండు నిర్మించారు. ఈ బస్టాండు ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంది కాని ఆదివారం కొంతమంది బస్టాండ్ పక్కన హోటల్ నిర్వహిస్తున్న వాళ్లు అయిటి పాముల మాజీ ఎంపీటీసీ పబ్బు వెంకన్న సహకారంతో లోకల్ అథారిటీ వాళ్లకు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా ఎలాంటి అనుమతులు లేకుండా బస్టాండ్ కూల్చివేయడానికి ప్రయత్నం చేశారు. దీంతో సుమారు 7 లక్షల నష్టం జరుగుతుందన్న విషయం తెలుసుకున్న నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి అఖిలపక్ష నాయకులతో అన్నారం స్టేజి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న కట్టంగూరు జెడ్పీటీసీ తరాల బలరాం మద్దతు తెలిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చిన వాహనాలను సీజ్ చేశారు. వచ్చిన కార్మికులను స్టేషన్‌కు తీసుకెళ్లారు విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్టంగూర్ జెడ్పీటీసీ తరాల బలరాం, మాజీ ఎంపీటీసీలు కక్కిరేణి రామస్వామి, గుండుగోని రాములు, చిలుముల రామస్వామి, ఇటుకుల సురేందర్, చిలుముల కృష్ణయ్య, రామ్‌రెడ్డి, సుధాకర్, దెందే శ్రీను, సురేష్, మహేష గంగాదేవిగూడెం, అన్నారం ఐటిపాముల, తేలువారిగూడెం, గార్లవాయిగూడెం, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



చిలుముల లింగయ్యకు జోహార్లు

నవతెలంగాణ-నల్లగొండ

సీపీఐ(ఎం) క్రియాశీలకంగా పనిచేసి మర్రిగూడలో పార్టీని కాపాడిన చిలూముల లింగయ్యకు జోహార్లు అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మర్రిగూడ గ్రామంలో చిలుముల లింగయ్య మృతదేహానికి ఎర్రజెండా కప్పి జోహార్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..మర్రిగూడ గ్రామం కష్టజీవులకు, కార్మికులకు అండగా నిలిచిందని, ఆ పోరాటంలో చిలూముల లింగయ్య కృషి అభినందనీయమని, ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. సమసమాజ స్థాపన కోసం కార్మికులు, కర్షకుల హక్కుల సాధనకై సీపీఐ(ఎం) ఎల్లవేళలా పోరాడుతుందని తెలిపారు. దోపిడీ లేని సమాజం కోసం విద్యా వైద్యం ఉపాధి కోసం ఉద్యమాలు నడుపుతుంది ఎర్రజెండా మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి ఎండి. సలీం, నాయకులు మందడి ఎల్లారెడ్డి, మాజీ ఎంపీపీ బొజ్జ మారమ్మ, బొజ్జ వెంకన్న, సీఐటీయూ నాయకులు కత్తుల యాదయ్య, బీపంగి రాములు, బీపంగి యాదయ్య, సహదేవులు, చిలునుల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణకు కేసీఆర్ మోసం

- సీఎల్పీ నేత బట్టి విక్రమార్క

నవతెలంగాణ-దేవరకొండ

కొట్లాడి కోరి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలు ఆత్మ గౌరవ లక్ష్యాలని కేసీఆర్ మోసం చేశాడని, తెలంగాణప్రజలకు క్షమాపణ చెప్పాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. బట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర దేవరకొండ నియోజకవర్గం కొండమల్లేపల్లి మండలం గుమ్మడపల్లి గ్రామానికి ఆదివారం చేరుకునే నాటికి 1000 కిలోమీటర్లు పూర్తవుతున్న సందర్భంగా అక్కడ నిర్మాణం చేసిన పైలాన్‌ను ఆయన ఆవిష్కరిస్తారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు ప్రజలు అడుగడుగున బ్రహ్మరథం పడుతూ ఈ ప్రభుత్వం పై ఉన్న తమ ఆక్రోషాన్ని, ఆగ్రహాన్ని బయట పెట్టారని బట్టి విక్రమార్క తెలిపారు. అంతకు ముందు 86వ రోజు శనివారం రాత్రి పట్టణంలోని మీనాక్షి చౌరస్తా వద్ద సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యురాలు రంజిత రంజన్ యాదవ్, ఏఐసీసీ కార్యదర్శ, మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్‌బాబు, నల్గొండ ఎంపీ ఉత్తంకుమార్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, మాజీ ఎంపీ వీ.హనుమంతరావు తెలంగాణ ప్రభుత్వంపై అనేక విమర్శలు చేశారు. నల్లగొండ జిల్లాలో ఉన్న పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా దున్నపోతు వలె నిద్రపోయిందని, కావాలని కుట్రపూరితంగా ప్రాజెక్టులను పూర్తి చేయలేదన్నారు. బీఆర్ఎస్ పాలనల్లో చుక్కనీరు కూడా నల్లగొండకు అదనంగా తీసుకురాని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సీఎం కేసీఆర్, మంత్రులు, ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి కాలేదని గుత్తా సుఖేందర్‌రెడ్డికి తెలుసా? ఆ ప్రాజెక్టుకు నీళ్లు ఎక్కడినుంచి వస్తాయో తెలుసా? తెలియకుండా ప్రాజెక్టు పూర్తి చేశామని నీళ్లు పారిస్తున్నమని చెప్పడం విడ్డూరం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అమ్మ హస్తం పథకం ద్వారా తొమ్మిది రకాల సరుకులు పంపిణీ చేస్తే ధనిక రాష్ట్రంలో పేదలకు తిండి పెట్టడానికి ఈ పాలకులకు ఏం పుట్టింది? తొమ్మిది సరుకులకు కోత పెట్టి బియ్యం షాపులుగా రేషన్ దుకాణాలను మార్చారు, ఎందుకు సంచిని, సంచిలో ఉన్న సరుకులను మాయం చేశారని విమర్శించారు. దేవరకొండలో కాంగ్రెస్ శ్రేణులు తొక్కుతున్న కదం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణ శివారు నుంచి పాదయాత్ర ప్రారంభమై సాయంత్రం కుందల్పహాడ్ క్రాస్‌రోడ్, కొండమల్లేపల్లి, గుమ్మడపల్లి గ్రామ శివారు వరకు పాదయాత్ర కొనసాగింది. పాదయాత్రలో డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, కాంగ్రెస్ నాయకులు రమావత్ జగన్‌లాల్, వత్య రమేష్‌నాయక్, బిలియన్ నాయక్, కిషన్ నాయక్, డాక్టర్ రవినాయక్, జాల నరసింహారెడ్డి, ముక్కామల వెంకటయ్యగౌడ్, లోకసాని శ్రీధర్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

'మన ఊరు-మనబడి'తో మౌలిక సదుపాయాలు

- ఉమ్మడి జిల్లాలో తొలి దశలో 1,093 పాఠశాలలు ఎంపిక
- తొలి దశలో 1,093 పాఠశాలలు.
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై దృష్టి

'మన ఊరు, మన బడి' కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ పనులు ఉమ్మడి జిల్లాలో వేగంగా కొనసాగుతున్నాయి. ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని హంగులతో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రధానంగా అదనపు గదుల నిర్మాణంతో పాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు.

నవతెలంగాణ-నల్లగొండ

ఉమ్మడి జిల్లాలో అత్యధిక ప్రభుత్వ పాఠశాలలకు సొంత భవనాలు ఉన్నా ప్రహరీలు లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. అలాంటి ప్రాంతాల్లో 'మన ఊరు, మన బడి' కింద ప్రహరీల నిర్మాణం, వంట గదులు, మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ, తాగునీటి సౌకర్యం, ప్రతి గదిలో ఫ్యాన్ల వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా ఫర్నీచర్‌తో పాటు భవనాలకు రంగులు వేస్తూ పాఠశాలలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులకు ప్రత్యేకంగా ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున ఒక డెస్క్ బెంచీ, డిజిటల్ బోర్డులు, ఉపాధ్యాయులకు, హెడ్‌మాస్టర్‌కు ప్రత్యేకంగా ఫర్నీచర్‌ను సమకూరుస్తున్నారు. ఆధునిక హంగులు, సౌకర్యాలు కల్పిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల స్వరూపం పూర్తిగా మారుతోంది. విద్యార్థుల సంఖ్య తగ్గకుండా, డ్రాపవుట్స్ లేకుండా, వారిని ఆకర్షించి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం వాటిని తీర్చిదిద్దుతోంది. ఉపాధ్యాయుల సంఖ్యకు అనుగుణంగా విద్యార్థులు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం ప్రస్తుతం వచ్చే విద్యాసంవత్సం నాటికి పాఠశాల రూపురేఖలు మార్చే దిశగా అడుగులు వేస్తోంది.

తొలి దశలో 1,093 పాఠశాలలు..

'మన ఊరు, మన బడి - మన బడి, మనబస్తీ' కార్యక్రమంలో భాగంగా తొలి



విడతగా 1,093 పాఠశాలలు ఎంపికయ్యాయి. నల్లగొండ జిల్లాలో 516, సూర్యాపేట జిల్లాలో 319, భువనగిరి జిల్లాలో 258 పాఠశాలలు ఎంపికయ్యాయి. నల్లగొండ జిల్లాలో 516 పాఠశాలలను అధికారులు ఎంపిక చేశారు. ఈ పాఠశాల్లో చాలా వరకు పనులు పురోగతిలో ఉన్నాయి. 516 పాఠశాల్లో మండలానికి రెండు చొప్పున 64 పాఠశాలలను గుర్తించిన అధికారులు అందులో పనులన్నింటినీ దాదాపు పూర్తి చేయించారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు సమకూరుస్తూ భవనాలను తీర్చిదిద్దారు. పాఠశాల వాతావరణం ప్రశాంతంగా ఉండేలా భవనాల రూపు రేఖలు మారుస్తూ పచ్చదనం ఉండేలా హరితహారంలో భాగంగా మొక్కలు నాటుతున్నారు. పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు వాటి అభివృద్ధిని వేగవంతం చేశారు. జిల్లాలో ఉన్న పాఠశాలలను విడతల వారీగా ఎంపిక చేసి మౌలిక వసతులు కల్పిస్తున్నారు. అందుకు దాతల సహకారం కూడా తీసుకుంటున్నారు. మోడల్ స్కూళ్లలో ఇప్పటికే 80శాతం మేర పనులు పూర్తయ్యాయి. విద్యాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలతో రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల తీరు మరింత మెరుగుపడే అవకాశం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై దృష్టి...

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం దృష్టిసారించింది. అందులో భాగంగా అన్ని పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపరుస్తోంది. నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలు మొత్తం 1,483 ఉన్నాయి. అందులో ప్రాథమిక పాఠశాలలు 1,126, ప్రాథమికోన్నత పాఠశాలలు 128, ఉన్నత పాఠశాలలు 229 వరకు ఉన్నాయి. ఎయిడెడ్ పాఠశాలలు 453 కాగా, రెసిడెన్షియల్, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు మరో 107, జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు మూడు ఉన్నాయి. అంతా కలిపి ప్రాథమిక పాఠశాలలు 1,207, ప్రాథమికోన్నత పాఠశాలలు 289, ఉన్నత పాఠశాలలు 550, మొత్తం 2046 పాఠశాలలు ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో కలిపి 2,38,296 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో వివిధ యాజమాన్యాల పరిధిలో 1,027 పాఠశాలలు ఉన్నాయి. యాదాద్రి జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 481, ప్రాథమికోన్నత పాఠశాలలు 68, ఉన్నత పాఠశాలలు 163, కేజీబీవీలు 11, మోడల్ స్కూళ్లు ఏడు, రెసిడెన్షియల్ పాఠశాలలు మూడు, సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు 19, మొత్తం 772 పాఠశాలలు ఉన్నాయి. వీరందరికి మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వ పాఠశాల్లో ఆధునిక వసతులు సమకూరుస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం దృష్టిసారించింది.

ప్రభుత్వ పాఠశాల్లో ఆధునిక వసతులు

భిక్షపతి (డీఈవో, నల్లగొండ)



'మన ఊరు, మన బడి - మన బస్తీ, మన బడి' కింద ప్రభుత్వ పాఠశాల్లో ఆధునిక వసతులు కల్పిస్తున్నాం. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ప్రశాంతమైన, ఆహ్లాదకర వాతావరణంలో విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచి వారికి నాణ్యమైన విద్య అందించి భావి పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలో అందుకు అనుగుణంగా తొలి విడతలో చేపడుతున్న నిర్మాణాలన్నింటిని పూర్తిచేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి సకల సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది విద్యార్థులకు అందుబాటులో తీసుకొస్తాం.

లక్ష రూపాయల రుణ మాఫీ చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

నవతెలంగాణ-మునగాల

ఏకకాలంలో రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ మండల కమిటీ సమావేశం వీరబోయిన వెంకన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిదారులందరికీ లక్ష రూపాయలు రుణ సాయం చేసి వారి కుటుంబాలని ఆదుకోవాలని సూచించారు. ఐకేపీ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం బిల్లులు రాక అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవే దన వ్యక్తం చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో పెండింగ్‌లో ఉన్న ధాన్యం బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బుర్రి శ్రీరాములు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు దేవర వెంకటరెడ్డి, పార్టీ మండల కార్యదర్శి చందా చంద్రయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్య లు బచ్చలకూర స్వరాజ్యం, విజయ లక్ష్మి, స్టాలిన్‌రెడ్డి, వెంకటాద్రి,



ఉపేందర్, జ్యోతి, కృష్ణారెడ్డి, రమేష్, గురువయ్య, వెంకన్న పాల్గొన్నారు.



దైవచింతనతో మానసిక ప్రశాంతత

నవతెలంగాణ-చౌటుప్పల్

దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు.ఆదివారం మండలపరిధిలోని జైకేసారం గ్రామంలో నిర్వహిస్తున్న ముత్యా లమ్మ పండుగలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ నాయకులు ఎమ్మెల్యేను పూలమాలలు,శాలువాలతో ఘ నంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మెన్ చింతల దామోదర్‌రెడ్డి, సర్పంచ్ కొర్పూరి సైదులు, నారాయణపురం జెడ్పీటీసీ వీరమల్ల భానుమతివెంకటేశ్‌గౌడ్, నాయ కులు సవిరెడ్డి జనార్దన్‌రెడ్డి, పల్లె మధుకృష్ణ, ఢిల్లీ మాధవరెడ్డి, బోదాసు వెంకటేశం, పల్లె శివకుమార్, చిన్నం బాలరాజు, లింగస్వామి, పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ఆత్మకూరుఎస్

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.ఆత్మకూర్ ఎస్ మండలం నెమ్మికల్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా యాదగిరిగుట్టలో వేలాది మంది గీత కార్మికులతో జరిగిన బహిరంగ సభలో 25 తీర్మానాలు చేసి ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశామన్నారు.ఆ తర్వాత



మునుగోడు ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ నిర్వహించిన గౌడ ఆత్మీయసమ్మేళనంలో కేటీఆర్ మాట్లాడుతూ మేము పెట్టిన కొన్ని డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.ద్విచక్ర వాహనాలు ఇస్తామన్నారు. గీతన్నబంధు, గీతన్న బీమా, పది రోజులలో ఎక్స్‌గ్రేషియా,సొసైటీలకు లిక్కర్ షాపులు ఇస్తామన్నారు.ఇచ్చిన మాట ప్రకారం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని గీత కార్మికులందరికీ ఉపాధి కలిగే చర్యలు చేపట్టాలని, వృత్తిలో ప్రమాదాలు జరగకుండా, మరణాలు సంభవించకుండా చూడాలని కోరారు.అందుకు ఆధునిక పరికరాలు ఇవ్వాలని, మారుతున్న పరిస్థితుల కనుగుణంగా వృత్తిలో మార్పులు తీసుకురావాలన్నారు.ప్రభుత్వం బీసీలకు, వృత్తిదారులకు ఆర్థిక చేయూతఅందించే విధంగా పథకం కింద ఒక లక్ష రూపాయలు గీతన్నలకు చోటు లేకపోవడం బాధాకర విషయమన్నారు. 2022-23 బడ్జెట్‌లో కేటాయించిన డబ్బులు టాడి కార్పొరేషన్‌కు ఇవ్వాలని తద్వారా సేఫ్టీ మోకు, ద్విచక్ర వాహనాలు తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు.రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల భూములకు ధరలు విపరీతంగా పెరగడంతో భూ యజమానులు తాటి,ఈతచెట్లను తొలగిస్తున్నారని తెలిపారు.వీరిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు పెట్టి జరిమానా విధించాలని కోరారు.జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్గూరి గోవిందు, మడ్డి అంజిబాబు, మాట్లాడుతూ పెన్షన్ 5వేలకు,ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. గౌడ యువతీ యువకులకు ఉపాధి కలిగించేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో నీరా తాటి ఉత్పత్తుల పరిశ్రమ పెట్టాలన్నారు. 560 జీవో ప్రకారం ప్రభుత్వ భూమి ఉన్న గ్రామాలలో ఐదు ఎకరాలభూమి సొసైటీకి ఇవ్వాలని హరితహారంలో పొట్టి వంగడాలు తాటి, ఈత, ఖర్జూర, గిరక, చెట్లను ప్రభుత్వమే సప్లై చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం సీనియర్ నాయకులు అబ్బగాని భిక్షం ,జిల్లా సహాయకార్యదర్శి ఉయ్యాల నగేష్ ,జిల్లా ఉపాధ్యక్షులు గుణగంటి కృష్ణ, జేరిపోతుల కృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు భట్టిపెల్లి నాగమల్లయ్య, పొడిశెట్టి సైదులు,నోముల వెంకన్న,బెల్లంకొండ ఇస్తారి, బొమ్మగాని కవిత, చెనగాని ఉస్మాన్, యమగాని ఐలయ్య, బోడ సైదులు ,గుణగంటి వెంకన్న, సొసైటీ అధ్యక్షులు మూల ఎల్లయ్య, అంబాల వీరస్వామి, కుక్కడపు సైదులు, తదితరులు పాల్గొన్నారు.



లక్ష సార్లు క్షమాపణ చెప్పాలి

- ఫ్లోరోసిస్‌ను అంతమొందించిన ఘనత కేసీఆర్‌దే
- చర్చలు రాజవరంలోనా.. జానపాడులో చేద్దామా?
- విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్

తెలంగాణను 60 ఏండ్లుగా పాలించిన కాంగ్రెస్ నాయకులు చేసిన తప్పుల మూలంగానే ఇన్నేళ్లు రాష్ట్రం ఇబ్బందులకు గురైందని వాళ్ళు చేసిన తప్పులకు లక్షసార్లు క్షమాపణ చెప్పి.. వెయ్యి సార్లు ముక్కును ఢిల్లీ వరకు నేలకు రాయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు.ఆదివారం నల్లగొండలోని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ మూగబోయిన గొంతులన్ని స్వరాలు సరిచేసుకుంటున్నాయని, నాలుగేండ్లుగా దిక్కులేని వాళ్ల కరోనా సమయం లో కనిపించని వాళ్ల బయటకు వచ్చి కేసీఆర్ పై ఆరోపణలు చేయడం దారుణమన్నారు. జిల్లాను 40 ఏండ్ల పాటు ఏక చక్రాధిపత్యంగా ఏలి సమస్యలకు బాధ్యులైన వాళ్ళు గొంతేసుకొని ఇతరులపై మాట్లాడడం సరికాదన్నారు.కాంగ్రెస్ జిల్లా నాయకులు పాదయాత్రలో నడిచేస్తూ ముందుండాలని చూస్తున్నారన్నారు.జానారెడ్డి, ఉత్తంకుమార్‌రెడ్డితో పాటు మిగతా వాళ్ల కేసీఆర్ క్షమాపణ చెప్పాలని అంటున్నారని అదే జరగాల్సి వస్తే నల్లగొండ నుంచి ఢిల్లీ వరకు కాంగ్రెస్ నాయకులే ముక్కు నేలకు రాయాల్సి వస్తుందన్నారు. నల్లగొండ జిల్లాను నాశనం చేసిన వీళ్ల వ్యవసాయంలో దేశానికి ఆదర్శంగా ఉన్న జిల్లాను నడ్డి విరిగేలా చేశారని రైతు ఎముకలు గూళ్ళు అయినాయని ఇలాంటి వాళ్లకి మాట్లాడడానికి కాస్తయినా సిగ్గుండాలని విమర్శించారు. ఫ్లోరోసిస్ ను పెంచి పోషించి లక్షలాది మందిని పొట్టన పెట్టుకున్న వాళ్ల ఫ్లోరిన్ ను పారదోలాల్సింది పోయి ఊరినే నాశనం చేసి జిల్లాకు పాకేలా చేశారన్నారు. ప్రత్యేక తెలంగాణ వచ్చిన తర్వాత నాలుగేళ్లలోనే ఫ్లోరోసిస్ ను పాల ద్రోలి మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికి మంచినీళ్లు ఇస్తున్న ఘనత కేసిఆర్ ప్రభుత్వానిదన్నారు.జిల్లాలో జరిగిన అభివద్ధిపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గంలోని జానపాడులో చర్చ పెడదామా లేదంటే జానారెడ్డి ప్రాతినిధ్యం వహించిన నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి ప్రాంతంలోని రాజవరంలో చర్చకు పెడదామా అని సవాల్ విసిరారు.తెలంగాణలో వరుసగా రెండు పంటల పండించేందుకు నీళ్ళు ఇస్తున్న ఘనత కూడా తెలంగాణ ప్రభుత్వానిదేనన్నారు.సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేసిన మూడో ఏడాది నుంచి 24 గంటల విద్యుత్ వ్యవసాయానికి అందిస్తున్నామన్నారు.తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు మీరు పాలిస్తున్న రాజస్థాన్, చత్తీస్‌ఘడ్ లో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాలేశ్వరం ప్రాజెక్టుతో సూర్యాపేటలో వ్యవసాయంలో నెంబర్ వన్‌గా నిలిచిందని ఈ విషయాలపై జానపాడు, రాజవరంలో లేకుంటే ఏదైనా సబ్ స్టేషన్లలో కూర్చుని చర్చ చేద్దామన్నారు.వేసవి వస్తే సబ్ స్టేషన్ లపై దాడి, బిందెల ప్రదర్శన, రైతులు విత్తనాల కోసం క్యూ లో నిలబడే రోజులు తెలంగాణ వచ్చాక పోయాయన్నారు. కాంగ్రెస్ నాయకులు బట్టి విక్రమార్క చేస్తున్న పాదయాత్రలో గతంలో మీరు చేసిన తప్పులను తెలుసుకొని మాట్లాడాలని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీంద్రకుమార్, నోముల భగత్‌కుమార్, నల్లమోతుభాస్కరరావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, రాష్ట్ర నాయకులు నిరంజన్ వలి, కొండూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు అంజయ్యది హత్యా?.... ఆత్మహత్యా?

- వెలుగు అంజయ్య మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి
- వైఎస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి ఏపూరి సోమన్న

నవతెలంగాణ-తుంగతుర్తి

మండల కేంద్రానికి చెందిన వెలుగు అంజయ్యది హత్యా..?ఆత్మహత్యా అనే తెలియదని, మరణంపై సమగ్ర విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, తుంగతుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఏపూరి సోమన్న డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలో వెలుగు అంజయ్య కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి మాట్లాడారు.నెలలు గడుస్తున్న వెలుగు అంజయ్య మరణం పై పోలీసులు విచారణ చేపట్టకపోవడం బాధాకరమన్నారు.పోస్టుమార్టం రిపోర్టును తక్షణమే బయటపెట్టాలని లేనియెడల అంజయ్య కుటుంబ సభ్యులతో కలిసి మెయిన్ రోడ్డు పై దీక్ష చేస్తానని హెచ్చరించారు.ప్రశ్నించిన వారిపై నియోజకవర్గంలో దాడులు చేస్తూ స్థానిక ఎమ్మెల్యే అధికార పార్టీ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారనిఆరోపించారు.నియోజకవర్గంలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగానే పాలన ఉంది తప్ప కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదన్నారు.తెలంగాణ రాష్ట్రంలో అధికార పార్టీ నాయకులు ఎమ్మెల్యేలు మంత్రులు లబ్ది పొందారే తప్ప సామాన్య ప్రజలకు ఒరిగిందేమి లేదని ఆరోపించారు.దళితబంధు పథకంలో అవినీతి అక్రమాలు జరగాయని, అన్న ప్రతిపక్ష నాయకులను ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ నా కొడుకులంటూ అసభ్య పదజాలంతో దూషించడం ఎంతవరకు సమంజసమన్నారు ప్రశ్నించారు.ఎమ్మెల్యే



గాదరి కిషోర్ కుమార్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అమలు కావడం లేదని పోలీసు వ్యవస్థ పూర్తిగా అధికార పార్టీకి అనుగుణంగా పనిచేస్తుందని అన్నారు. నియోజకవర్గంలో అధికార పార్టీ అవినీతి అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయిందన్నారు.ఫ్యాక్షన్ రాజకీయాలను తలపించినట్లుగా ఉందన్నారు.నియోజకవర్గంలో అధికార పార్టీ కనుసన్నుల్లోనే కాంగ్రెస్ పని చేస్తుందని తెలిపారు.వెంటనే ప్రభుత్వం అధికారులు స్పందించి వెలుగు అంజయ్య కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.వారి వెంట వైఎస్సార్టీపీ మండల అధ్యక్షులు చింతకుంట్ల పరమేష్, అంజయ్య, యాకన్న, ప్రేమ్, జక్కులసైదులు, రామ్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

నవతెలంగాణ-తిరుమలగిరి

హైదరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వంగాల దానయ్యతో పాటు పలువురు నాయకులు బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై తుంగతుర్తి శాసనసభ్యులు గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.నూతనంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.



కుసుమ మరణం తీరని లోటు



- మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ

ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జిల్లా ప్రజా పరిషత్ చైర్మెన్ కుసుమ జగదీష్ ఆకస్మిక మరణం పట్ల విద్యుత్‌శాఖా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా సంతాపం ప్రకటించారు. ఉద్యమ మిత్రుడిని కోల్పోవడం దురదృష్టకరమన్నారు. కుటుంబ సభ్యులు ఈ సమయంలో ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-నకిరేకల్



నకిరేకల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కట్టంగూర్ మండలం పందెనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నుండి 50 కుటుంబాలు ముప్పిడి యాదయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే చిరుమర్తి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ముప్పిడి నాగరాజు, గజ్జి సాయి కుమార్, గజ్జి మహేష్, గజ్జి శ్రీకాంత్, భూతం సతీష్, అక్కినపల్లి రవి, బోయిని రవి, సంకటి నర్సయ్య ముక్కర మల్లేష్, పగడాల అరుణ్, ముప్పిడి మహేష్, అక్కినపల్లి సాయి తదితరులు ఉన్నారు. ఈ కార్యాలయంలో జడ్పీటీసీ తరాల బలరాం, ఎంపీపీ జెల్లా ముత్తి లింగయ్య, మండల పార్టీ అధ్యక్షుడు ఏడుకొండలు, పీఏసీఎస్ చైర్మెన్ నూక సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పోగుల నర్సింహా, గ్రామశాఖ అధ్యక్షుడు నరేష్, ముప్పిడి యదయ్యా, అయ్యప్ప, పగడాల వీరయ్య పాల్గొన్నారు.

18న పక్షవాతం రోగులకు మెడికల్ క్యాంపు

నవతెలంగాణ-నల్లగొండ

నర్రా రాఘవరెడ్డి స్మారక ప్రజా వైద్యశాల ఎంవీఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షుగర్, బీపీ, ఫిట్స్, పక్షవాతం రోగులకు ఈనెల18 న మూడో ఆదివారం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంవీఎన్ ట్రస్ట్ కార్యనిర్వాహక కార్యదర్శి పీ.నర్సిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జబ్బులు ఉన్నవారు 2, 3 రోజులకు ముందే టెస్టులు చేసుకుని, ప్రస్తుతం వాడే మందులు, డాక్టర్ రాసిన స్లిప్పులు, పరీక్ష రిపోర్టులు తీసుకొని రావాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ గోపాలం శివన్నారాయణ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ మెడికల్ క్యాంప్ ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం, సీపీఐ(ఎం) కార్యాలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను 9490098311 సంప్రదించగలరని కోరారు.

బహిరంగ సభకు తరలివెళ్లిన నాయకులు



నవతెలంగాణ-మిర్యాలగూడ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం జరిగిన బహిరంగ సభకు మిర్యాలగూడ నుంచి సీపీఐ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలోని రాష్ట్రంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ రంగ పరిశ్రమలు, రాజ్యాంగ లౌకిక వ్యవస్థ పరిరక్షణకై కొత్తగూడెంలో ప్రకాశం స్టేడియంలో బహిరంగ సభ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి కార్యదర్శి జిల్లా యాదగిరి, మిర్యాలగూడ మండల సహాయ కార్యదర్శి గువ్వల అంజయ్య, గోగుల యాదగిరి, వలపట్ల వెంకన్న, గువ్వలవెంకటయ్య, ఎస్ కే షమీం, లింగంపల్లి సైదమ్మ, బంటు రేణుక, చింతమల రాములు, బంటు దేవి, వరప్రసాద్, గూగుల్ యశ్వంత్, లింగం తదితరులు పాల్గొన్నారు.

చౌలిని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-డిండి



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వారోత్సవాలలో భాగంగా గురువారం చెరువుల పండుగ సందర్భంగా డిండి మండలం దాసరి నెమిలిపూర్ గ్రామానికి చెందిన చౌలి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లోని జీవన్ ఆస్పత్రిలో దేవరకొండ శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ చౌలిని పరామర్శించారు. ఈ సందర్భంగా చౌలికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

ప్రభుత్వ బడులపై నమ్మకం కల్పించాలి

- బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాలోత్ దశరథ్‌నాయక్

నవతెలంగాణ-మిర్యాలగూడ

పాఠశాలల ప్రారంభం వేళ ప్రభుత్వ బడులపై ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బంజారా ఉద్యోగుల సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు మాలోత్ దశరత్ నాయక్ కోరారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ బడులను ప్రజలు ఆదరించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. పాఠశాలల ప్రారంభం నాటికి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని, సరిపడా తరగతి గదులు ఉండేలా చూడాలన్నారు. ఉన్నత పాఠశాలలో ప్రతి సబ్జెక్ట్‌కు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల నిర్వహణ కోసం స్కావెంజర్లను నియమించాలని, పాఠశాల ప్రారంభం రోజు పుస్తకాలు, డ్రెస్సులు అందేలా చూడాలన్నారు. ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలను కూడా తక్షణమే చేపట్టాలని కోరారు.

నక్కలగండి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలి

నవతెలంగాణ-దేవరకొండ



నక్కలగండి ప్రాజెక్టును తరితగతిన పూర్తిచేసి ప్రజలకు ఇచ్చిన హామీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీని నిలబెట్టుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత ఎన్నికల ప్రచార సమయంలో తమ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే నక్కల గండి ప్రాజెక్టును స్వయంగా నేనే కుర్చీ చేసుకొని పూర్తి చేస్తానని ఇచ్చిన హామీని మర్చిపోయి పగల్బాలు పలికి ఎన్నికల్లో గెలిచి ఈ ప్రాంత ప్రజల మనోభావాలు జీవన ఉపాధిని దెబ్బతీసే విధంగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు చోల్లేటి భాస్కరాచారి, ప్రజా సంఘాల జేఏసీ డివిజన్ కమిటీ నాయకులు కంబాలపల్లి వెంకటయ్య, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షులు ఎర్ర ఆంజనేయులు, రాచమల్ల నాగయ్య ముదిరాజ్, పిట్ల వెంకులు (వడ్డెర), ఎండి. అబ్దుల్ కలాం, నల్లగాసు కృష్ణయ్య, రెడ్డి శంకర్, కన్నె బోయిన మల్లయ్యయాదవ్, పచ్చిపాల వెంకటయ్య, ఏటెల్లి శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అండగా నిలిచిన దేవేందర్

నవతెలంగాణ-దేవరకొండ

దేవరకొండ మండలం కట్టకొమ్ము తండాలో ఇటీవల వీచిన గాలి దుమారాలకు ఇంటి పైకప్పులు లేచిపోయి నిరాశ్రయులైన పేద ప్రజలను వీడీఎన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాజీ మున్సిపల్ చైర్మెన్ వడ్త్య దేవేందర్‌నాయక్, మున్సిపల్ చైర్మెన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ జానుయాదవ్, రైతుబంధు అధ్యక్షులు శిరందాసు కృష్ణయ్య ఆదివారం గ్రామాన్ని సందర్శించి పరిస్థితి తెలుసుకున్నారు. మానవత్వంతో స్పందించి ఆ బాధిత కుటుంబాలకు తన వంతుగా ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరు ఇబ్బందులతో బాధపడకుడదని, ఎలాంటి సహాయం కావాల్సిన వీడీఎన్ సేవలు అందిస్తుందని తెలిపారు. ఆయనతో పాటు గ్రామశాఖ కో ఆప్షన్ మెంబర్ నేనావత్ రాజు, గ్రామ పెద్దలు నేనావత్ భీమా, నేనావత్ హన్మంతు, సైదులు, అంజి, ఓర్సు గోపాల్, కొమ్మురాజుల రాజు, సంపాంగి వెంకన్న, అంజమ్మ, యాదగిరి, నర్సిమ్మా, ఆంజనేయులు, ఎనిమల్ల రమేష్, చింతకుంట్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-అడవిదేవులపల్లి

ఆశా వర్కర్ల నూతన కమిటీని ఆదివార నల్లగొండ జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు మహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల అధ్యక్షురాలుగా బండారి కళావతి, ఉపాధ్యక్షురాలు చంద్రకళ, కార్యదర్శిగా విజయ భవాని, సహాయ కార్యదర్శిగా బండి జానకమ్మ కోశాధికారిగా పద్మ, ప్రచార కార్యదర్శి సంధ్య, మరియు కమిటీ సభ్యులుగా నాగలక్ష్మి, సావిత్రి, రోజా, జయమ్మను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం సీఐటీయూ ఉమ్మడి మండల కన్వీనర్ బైరం దయానంద్ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనం 18000 చేయాలని, అదేవిధంగా ప్రభుత్వం అందించే డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఆరోగ్య బీమా, పిఎఫ్ వంటి పథకాలు వర్తింపచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం అందజేతం

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల పట్టణంలో 10 వ వార్డుకి చెందిన దాసరి మారయ్య అనారోగ్యంతో మరణించారు. ఆదివారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి మున్సిపల్ చైర్మెన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మెన్ మెండే సైదులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జిగిని బిక్షం రెడ్డి , పాల సంఘం చైర్మెన్ వరకాంతం నరేందర్ రెడ్డి, జిట్టా చంద్రకాంత్, సిలువేరు శేఖర్, దాసరి నరసింహ, గండమల్ల శంకర్, మంచాల గణేష్, దాసరి శ్రీను, దాసరి విజయ్, దాసరి రాజారాం, మందుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సౌరభాలను గుబాళించిన దశాబ్ది వేడుక

- ఘనంగా తెలంగాణ సాహిత్య దినోత్సవం
- సమాజం హితం, శ్రేయస్సు, సమకాలీన పరిస్థితులు సాహిత్యం ప్రతిబింబిస్తుంది
- రాష్ట్ర అద్భుత ప్రగతిని వివరించేలా కవులు, సాహితీ వేత్తలు రచనలు చేయాలి
- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ సాహిత్య దినోత్సవం అట్టహాసంగా జరిగింది. కవులు, కవయిత్రులు, సాహితీవేత్తలు ఉత్సాహంగా తరలివచ్చి తమ పద్య, వచన కవిత్వాలతో తెలంగాణ అస్తిత్వం, రాష్ట్ర ప్రగతిని, ఔన్నత్యాన్ని ఆవిష్కరింపజేశారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్ సాహితీ సౌరభాల గుభాళింపులకు వేదిక అయ్యింది. ముందుగా జిల్లా గ్రంథాలయ సంస్థ లో ప్రజాకవి, గ్రంథాలయ ఉద్యమ నేత, రచయిత వట్టి కోట ఆల్వార్ స్వామి విగ్రహానికి జిల్లా కలెక్టర్ టీ.వినయ్ కృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అర్.మల్లికార్జునరెడ్డిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి సాహిత్య దినోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి



ముఖ్యఅతిథిగా హాజరైన విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలనతో కవి సమ్మేళనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతిని,అభివృద్ధిని ఔన్నత్యాన్ని పెంపొందించే విధంగా సాహితివేతలు, కవులు రచనలు వెలువరుంచాలని అన్నారు. సమాజ హితం, శ్రేయస్సు, సమకాలీన పరిస్థితులకు సాహిత్యం అద్దం పడుతుందన్నారు. కరువు కాటకాలతో అల్లాడిన జిల్లా నేడు అన్నపూర్ణ జిల్లాగా తయారైందన్నారు. ముందుగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన 70 మంది సాహితీవేత్తలు, కవులు తమ సందర్భోచిత కవితా వచనాలతో ఈ కార్యక్రమానికి వన్నెలద్దారు. ఒకరికొకరు దీటుగా అక్షర విన్యాసాలు, పదబంధాలను ప్రయోగిస్తూ పద్య, వచన కవిత్వాలతో సాహిత్యాభిమానుల మన్ననలు అందుకున్నారు. ప్రారంభమైన కవి సమ్మేళనం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమై 8 గంటల వరకు వరకు కొనసాగగా, కవుల కవితా ఝరి అలుపెరుగని ప్రవాహంలా కొనసాగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యాన్ని, ఉద్యమ కాలం నాటి పరిస్థితులు, తెలంగాణ అమరుల త్యాగాలను గుర్తు చేస్తూ, వివిధ రంగాలలో తెలంగాణ సాధించిన అద్వితీయ ప్రగతి గురించి తమ కవితల ద్వారా హృద్యంగా ఆవిష్కరించారు. కవి సమ్మేళనం కార్యక్రమం ఆద్యంతం ఆసక్తిగా సాగుతూ అందరిని అలరింపజేసింది. తెలంగాణ ప్రాశస్త్యం, ఉద్యమ ప్రస్థానంలో రాష్ట్రం సాధించిన విజయాలను పోషించిన పాత్ర, సాహితీ లోకంలో ఈ ప్రాంతానికి గల ప్రత్యేకత గురించి కవులు తమదైన శైలిలో కవితాత్మకత రూపంలో అభివర్ణించారు. ప్రస్తుత సమాజంలో సాహితీ రంగం పోషిస్తున్న పాత్ర గురించి విడమరచి చెప్పారు. ఈ సందర్భంగా కవిసమ్మేళనంలో పాల్గొన్న కవులందరిని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక, రూ. 1116 నగదు పారితోషకంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, రామావత్ రవీంద్ర కుమార్, నల్లమోతు భాస్కరరావు, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అడిషనల్ కలెక్టర్ ఖుష్బు గుప్తా, మున్సిపల్ చైర్మెన్ మందడి సైదిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రేగట్టే మల్లికార్జున్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ పంకజ్ యాదవ్, ట్రై కార్ చైర్మెన్ రాం చంద్ర నాయక్, డీఈఓ బిక్ష పతి, డీపీఆర్ఓ పి.శ్రీనివాస్ వివిధ శాఖలు జిల్లాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వైతాళికులు వట్టికోట ఆళ్వారుస్వామి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ



తెలంగాణ సాహితీ రంగంలో, గ్రంథాలయ ఉద్యమంలో ఎనలేని కృషిచేసిన వట్టికోట ఆళ్వారుస్వామి తెలంగాణ వైతాళీకులుగా నిలిచిపోయారని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణరెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని వట్టికోట విగ్రహానికి పూలమాలవేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా ప్రజలను చైతన్యపరచడానికి వట్టికోట చేసిన సేవలు మరువలేనిదని అన్నారు. ఈ సందర్భంగా గ్రంథాయానికి సోలార్ సౌకర్యం కల్పించాలని చైర్మెన్ రెగట్టే మల్లిఖార్జున్‌రెడ్డి కలెక్టర్ అండగా పరిశీలించి ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెగట్టే మల్లిఖార్జున్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయోద్యమానికి వట్టికోట ఆళ్వారుస్వామి సేవలు అనుగుణంగా గ్రంథాలయంలో పాఠకలుకు సౌకర్యలు అందిస్తుమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను చైర్మెన్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బీ. బాలమ్మ, గ్రంథాలయ సిబ్బంది కట్టా నాగయ్య, నిర్మాలాదేవి, బీ.శ్రీనివాస్ గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇండ్ల స్థలాలివ్వాలి

నవతెలంగాణ-చిట్యాల



అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాల మండలం చిన్న కాపర్తి గ్రామంలోని పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గత ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిని ఆదివారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పరిశీలించి, ఆయన మాట్లాడారు. రైతుల నుండి ప్రభుత్వం కొనుగోలు చేసి ఏండ్లు గడుస్తున్నా నిరుపేద కుటుంబాల వారికి స్థలాలు పంపిణీ చేయకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆ స్థలాల్లో రైతు వేదిక, గ్రామ పంచాయతీ, పల్లె ప్రకృతి వనం వంటి ప్రభుత్వ అవసరాల కోసం నిర్మాణాలు చేపట్టడం వల్ల పేదల ఇండ్ల స్థలాల పంపిణీ నిలిచిపోయిందని విమర్శించారు. మండలంలోని చిన్న కాపర్తి, నేరడ, ఉరుమడ్ల చిట్యాల, వట్టిమర్తి గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న ఇండ్ల స్థలాలు రాజకీయాలకు అతీతంగా పంపిణీ చేయకపోతే నిరు పేదలందరినీ సమీకరించి ఆందోళన, పోరాటాలు ఉధృతంగా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు కోనేటి రాములు, లోడె విష్ణుమూర్తి, రూపని ఇద్దయ్య, హన్మయ్య, మామిడి గణేష్, లోడె రామకృష్ణ, వివిధ ప్రజా సంఘాల నాయకులు రూపని సైదులు, వీరమళ్ళ చంద్రయ్య, సైదులు, రుద్రారపు బిక్షం, రూపని పద్మ, హెచ్చు దేవకమ్మ, బొమ్మగాని అండాలు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆదర్శప్రాయుడు

- ఎమ్మెల్యే భాస్కర్‌రావు

నవతెలంగాణ-వేములపల్లి



ప్రపంచ జ్ఞానమూర్తి ఆదర్శప్రాయుడు బీఆర్.అంబేద్కర్ అని ఎమ్మెల్యే భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని అంబేద్కర్ నగర్‌లో స్థానిక శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్‌రావు విగ్రహ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల కనుగుణంగానే తెలంగాణ రాష్ట్ర పాలన కేసీఆర్ సారథ్యంలో జరుగుతుందన్నారు. భారత దేశంలోనే కాదు ప్రపంచంలోనే అతిపెద్ద 125 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని హైదరాబాదులో ఆవిష్కరణ జరుపుకున్నామన్నారు. దళితుల కోసం దళిత బంధు స్కీం కింద 50 యూనిట్లు రెండో విడతలో ఇస్తానని హామీ ఇచ్చారు. దళితులను ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంతోనే కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గృహలక్ష్మి క్రింద సొంత జాగ ఉన్న వారికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మజ్జిగపు పద్మ సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ ఇరుగు మంగమ్మ వెంకటయ్య, ఎంపీటీసీ పళ్ళ వీరయ్య , టిఆర్ఎస్ మండల నాయకులు కట్టా మల్లేష్ గౌడ్, అంబేద్కర్ విగ్రహదాతలు ఎలిజాల రమేష్ , డాక్టర్ ఈసం జానకి రాములు,కందుల శివకృష్ణ, భోగారి శ్రీరాములు,కోడి రెక్క ఫకీరయ్య, కోడి రెక్క మట్టయ్య , వెంకన్న, అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ బాధ్యులు కోడి రెక్క శంభు లింగం , కోడి రెక్క వెంకటయ్య, మహిళలు ,యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూకి నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ బీప్లస్ గ్రేడ్ ప్రదానం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



ఉన్నత విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలు, పనితీరుకు కొలమానంగా భావించే నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ బృందం పరిశీలన గత నెల 24, 25, 26 తేదీల్లో జరిగిన దరిమిల మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయానికి బీ ప్లస్ గ్రేడును ప్రధానం చేసినట్లు ఉపకులపతి ఆచార్య గోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో 2.32 గా ఉన్న సీజీపీఏ ఇప్పుడు 2.65 గా మెరుగుపడటం ద్వారా ఈ గ్రేడ్ సాధించినట్లు తెలిపారు. మౌలిక సదుపాయాల్లో గణనీయమైన ప్రగతి సాధించడంతోపాటు ప్రతిష్టాత్మకంగా రాష్ట్రస్థాయి కామన్ ఎంట్రన్స్‌లు నిర్వహించే స్థాయికి చేరడం, విద్య ప్రమాణాలను మెరుగుపరచడం ద్వారా ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. అధ్యాపకుల కొరతను అధిగమించి నాణ్యమైన పరిశోధనలను, ప్రాజెక్టులను సాధించి ముమ్ముందు మంచి ఫలితాలను రాబట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఇందుకు శ్రమించిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రిజిస్టార్ ఆచార్య తుమ్మ కృష్ణారావు, ఓఎస్‌డీ ఆచార్య అల్వాల రవి, ఐక్యు ఏసి డైరెక్టర్ డాక్టర్ కౌతా శ్రీదేవి ఆనందాన్ని వ్యక్తపరుస్తూ, సహకరించిన సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.



కస్తూరి వారి ఆత్మీయ సమ్మేళనం

- కస్తూరి వంశ వృక్షం పుస్తకం ఆవిష్కరణ

నవతెలంగాణ-భువనగిరి రూరల్

జిల్లా కేంద్రానికి చెందిన కస్తూరి హాస్పిటల్స్ ఎండి కస్తూరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కస్తూరి వారి ఆత్మీయ సమ్మేళనాన్ని యాదగిరిగుట్టలో ఆదివారం పెద్దఎత్తున నిర్వహించారు. కస్తూరి వంశవృక్షం పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా భూదాన్ పోచంపల్లి మున్సిపల్ చైర్మెన్ చిట్టి పోరు విజయలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఎంత ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు.అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ కస్తూరి వారి వంశవృక్షం సేవా కార్యక్రమాలను ముందుకు కొనసాగిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కస్తూరి రాందాస్, వీరనారాయణ , రాజారామ్, కిష్టయ్య, సుదర్శన్, భిక్షపతి, రామాంజనేయ, విమల, బలరాం,కస్తూరి కుటుంబ సభ్యులు, మిత్రులు హాజరయ్యారు.



ప్రమాద బాధితుడికి పరామర్శ

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ మునిసిపాలిటీ కంప్యూటర్ ఆపరేటర్ మొహమ్మద్ జానీ ప్రమాదవశాత్తు కాలికి ఫ్యాక్చర్ కావటంతో చికిత్స అనంతరం ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను ఆదివారం టీపీసీసీ రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దైద రవీందర్ పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఎండీ.యూసుఫ్, అబ్దుల్ మజీద్, పందిరి సతీష్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆదివారం జరిగిన గ్రూప్-1 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 51 పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన పరీక్షకు 16,095 మంది అభ్యర్థుల హాజరవ్వాల్సి ఉండగా 11,414 మంది మాత్రమే హాజరై 4,681 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

నాగార్జునపేట తండాలో తాగునీటి కష్టాలు

నవతెలంగాణ-నాగార్జునసాగర్



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకం అని చెప్పుకుంటున్న మిషన్ భగీరథ పథకం అధికారుల అలసత్వం వల్ల ప్రహసనంగా మారడంతో గిరిజన గ్రామాల ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. లక్షలాది రూపాయలతో ట్యాంకు నిర్మించిన ఇంటింటికి నల్లా నీరు ఇస్తున్నామని ప్రగల్బాలు చెప్పుకుంటున్న ప్రభుత్వం మాత్రం గిరిజనుల దాహార్తిని మాత్రం తీర్చలేకపోతుంది. తిరుమలగిరిసాగర్ మండలం నాగార్జునపేట గ్రామంలో తాగునీరు లేక అనేక కష్టాలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు 5 రోజుల నుండి రాకపోవడం, తండాలో ఒక బోరు లేకపోవడంతో తండా ప్రజలు తాగునీటికి తహతహలాడుతున్నారు. సమీపంలోని వ్యవసాయ బోరుబావి నుండి నీటిని ట్యాంకర్ల ద్వారా ట్రాక్టర్ ద్వారా డ్రమ్ములలో, బిందెల ద్వారా మోసుకొని తీసుకువచ్చి తాగాల్సి వస్తుందని తండా వాసులు వాపోతున్నారు. అసలే వ్యవసాయ పనులను చేసుకొని అలసిపోయి ఇంటికి వస్తే కనీస అవసరాలకు నీళ్లలేక తిరిగి వ్యవసాయ బోరువద్ద నుండి నీళ్ళు మోసుకొని రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక మిషన్ భగీరథశాఖ ఎఈ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లిన పట్టించుకోకుండ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా సరఫరా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సత్వరమే నీటి కష్టాలను తీర్చాలి



బీ.నర్సింహ(తండ వాసి)

నాగార్జునపేటలో నెలకొన్న నీటి కష్టాలను వెంటనే తీర్చాలి. మిషన్ భగీరథ నీళ్లు 5 రోజుల నుండి రాక పోవడంతో నాగార్జునసాగర్‌కు వెళ్లి తండా వాసులు నీటిని కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. మిషన్ భగీరథకు సంబంధించిన అధికారులు, స్థానిక ఎమ్మెల్యే నోముల భగత్ స్పందించి త్రాగునీటి కష్టాలను తీర్చాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

నవతెలంగాణ-మర్రిగూడ

మర్రిగూడ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శివ స్వరూప రాణి ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఉదయం 8:30 నుంచి 9 గంటల లోపు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మధ్యాహ్నం 2.00 నుండి 2.30 నిమిషాలలోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్, వాటర్ బాటిల్, పెన్, పెన్సిల్, షార్ప్ నర్, స్కేల్,ఎరైజర్ వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

సిరి తెలంగాణ

నాడు వ్యవసాయం... ఆగమాగం.. నేడు మా తెలంగాణం.. కోటి ఎకరాల మా గణం..
తెలంగాణ పోలీసు వ్యవస్థ.. నాలుగున్నర కోట్ల ధన, మాన, ప్రాణాలకు సురక్ష..
అలనాడు విద్యుత్ రంగం పవర్ హాలిడేకు ప్రతిరూపం... నేడు తెలంగాణ 24 గంటల విద్యుత్తు దేశానికి తల మాణికం..
ఇది నా విద్యుత్ తెలంగాణ..
తెలంగాణ పారిశ్రామిక విత్తు.. అభివృద్ధిలో ఆకాశమే హద్దు..
తెలంగాణలో సాగునీటి సోయగాలు.. కృష్ణమ్మ గోదావరి, మూసీ నదుల త్రివేణి సంగమం.. బహులార్థక సారక కాళేశ్వరం ప్రాజెక్టుకు పునాదులు
నా జలసిరి.. తెలంగాణ..
కుల వృత్తుల సంక్షేమానికి మెట్టు.. అదే.తెలంగాణ అభివృద్ధికి కనికట్టు...
తెలంగాణ హరితహారం.. పకృతి తొడిగిన మణిహారం...
తెలంగాణ సుపరిపాలన సవ్వడి.. నూతనలి లిజిల్లాలలి లిమండలాల, మున్సిపాలిటీ, పంచాయితీల ఒరవడి...
తెలంగాణలో వైద్యం.. కెసిఆర్ కిట్టు, న్యూట్రిషన్ కిట్టు, ప్రగతి పాలనకు, తల్లిలాలనకు తొలిమెట్టు...
ఇది నా వైద్య తెలంగాణ..
తెలంగాణ పల్లె ప్రగతి.. పట్టణ ప్రగతి, నలుదిక్కులు. చాటును ఖ్యాతి...
గురుకుల, విద్యాభివృద్ధి.. నాణ్యమైన విద్యకుపరిపుష్టి...
నాడు అమరుల త్యాగం.. నేడు..స్వరాష్ట్రం మై జగతిలో వెలుగుతున్న కోటి రతనాల వెలుగు..
నా సిరి తెలంగాణ... కోటి రతనాల వీణ



ఎండీ. సాదత్ అలి
జర్నలిస్ట్ నార్కట్‌పల్లి
9885083762



ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

• ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోత్‌వినోద్‌కుమార్

నవతెలంగాణ-చివ్వెంల



ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోత్ వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.వేసవిసెలవులు తర్వాత మళ్లీ పునర్‌ప్రారంభం కానున్న ప్రభుత్వపాఠశాలలో నేటికి కూడా విద్యార్థులకు ఎటువంటి సౌకర్యాలు వసతులు కల్పించకుండా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.ప్రభుత్వ పాఠశాలలో అడిగేస్తుంటే సమస్యలు స్వాగతం పలుకుతాయని స్పష్టం చేశారు.పాఠశాల పరిసరాలలో పరిశుభ్రత శూన్యం అని,వెంటనే పాఠశాలలో మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నేటి నుండి ప్రారంభం కావున పాఠశాలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఇష్టానుసారంగా ఫీజుల పేరుతో విద్యార్థులను దోచుకుంటారన్నారు. ఫీజులనియంత్రణచట్టం పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.



ప్రజాగర్జనకు తరలిన సీపీఐ శ్రేణులు

నవతెలంగాణ-తిరుమలగిరి

ఖమ్మం జిల్లా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరుగుతున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగసభకు తిరుమలగిరి మండలం నుండి సీపీఐశ్రేణులు బయల్దేరారు.ఈ సభకు సీపీఐ నాయకులు డీకే రాజా ముఖ్యఅతిథిగా వస్తున్న సందర్భంగా తిరుమలగిరి మండలం నుండి సూర్యాపేట జిల్లా కార్యవర్గ సభ్యులు తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లాంల యాదగిరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి ఇక్బాల్, ఏఐవైఎఫ్ మండల కన్వీనర్ ఎండి ఫయాజ్,మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు ఎండి షాహిదా, తొండ గ్రామ శాఖ కార్యదర్శి కనుక అశోక్,సుంచు సత్తయ్య, కుదురుపాక ఉప్పలయ్య, కొమురయ్య, చిల్లర సోమయ్య,మహీమున్నీసా ఎల్లంల సోమలక్ష్మి తదితరులు సభకు బయలుదేరారు.

నూతనకల్:అర్హులైన రైతులకు పోడుభూములలో పట్టాలివ్వాలని కోరుతూ కొత్తగూడెం జిల్లాకేంద్రంలోని ప్రకాశం స్టేడియంలో సీపీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజాగర్జన బహిరంగసభకు ఆదివారం మండలకేంద్రం నుండి ఆ పార్టీ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌తో పాటు సీపీఐ నాయకులు తరలివెళ్లారు.తరలివెళ్లిన వారిలో వెంకన్న, లక్ష్మయ్య, లింగయ్య, రవి ఉన్నారు.

రూ.లక్ష గీతకార్మికులకు వర్తింపజేయాలి

నవతెలంగాణ-తుంగతుర్తి



తెలంగాణ ప్రభుత్వం బీసీ కులాలకు ఆర్థిక చేయూతనందించే పథకం కింద అందించే లక్ష రూపాయల పథకం రాష్ట్రంలోని గీత కార్మికులకు వర్తింపజేయాలని గౌడసంఘం తుంగతుర్తి మండల కోశాధికారి తొట్ల సుధాకర్‌గౌడ్ డిమాండ్ చేశారు.ఆదివారం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.నాటి బ్రిటిష్ నిజాం కాలం నుండి ప్రభుత్వాలకు పన్ను కట్టిన ఏకైక కుల వృత్తి గౌడ కులస్తుడని అన్నారు. ప్రస్తుతం గీత కార్మికులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని రోజుకు మూడుసార్లు తాటిచెట్లు ఎక్కి దిగి చావుతో పోరాడుతున్నారని, ఇంటికి వచ్చేదాకా నమ్మకం లేని ఏకైక వ్యక్తి ఒక గీత కార్మికుడేనన్నారు.

ప్రభుత్వ బడులలో సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-కోదాడరూరల్



ప్రభుత్వ బడుల్లో సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షులు బడుగుల సైదులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ బడులలో మౌలిక వసతులు కల్పించి పాఠశాల, ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని, పాఠశాలల్లో పారిశుధ్య కార్యక్రమాలకు ప్రత్యేకంగా వర్కర్లను నియమించాలన్నారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేంతవరకు విద్యా వాలంటీర్లను నియమించాలని తెలిపారు.

టీడీపీ మహిళా రాష్ట్ర కార్యదర్శిగా ఉప్పగండ్ల సరోజ

నవతెలంగాణ-కోదాడరూరల్



తెలంగాణా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మహిళ రాష్ట్ర కార్యదర్శిగా ఉప్పగండ్ల సరోజ నియామక ఉత్తర్వులు రాష్ట్ర కమిటీ ద్వారా ఆదివారం జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ నుండి ఎంపీటీసీగా, కౌన్సిలర్‌గా, నల్లగొండ పార్లమెంటు మహిళా అధ్యక్షురాలుగా పనిచేశానన్నారు. ఉప్పగండ్ల సరోజ ఎంపికకు సహకరించిన జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, తెలంగాణా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌కి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు షకిలారెడ్డికి, పార్లమెంటు అధ్యక్షులు నెల్లూరి దుర్గాప్రసాద్‌కి, ముత్తినేని సైదేశ్వరావుకి, తొండపు సతీష్‌కుమార్‌కి, నంబూరి సూర్యం, మండల కమిటీలకు, పట్టణ కమిటీకి, అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పరుగుపందెం

నవతెలంగాణ-హుజూర్‌నగర్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు పట్టణంలోని ఇందిరా సెంటర్ నుండి గాంధీ పార్క్ వరకు పరుగు పందెం 2కే రన్ నిర్వహిస్తున్నట్టు ఎస్సై వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, ప్రత్యేక ఆహ్వానితుడిగా ఎస్పీ రాజేంద్రప్రసాద్, కోదాడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

తిరుమలగిరి:తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన కంభంపాటి సోమయ్య అకాల మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ ఆదివారం వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.మృతుని కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మెన్ నాగరిగారి ప్రీతం,కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్,మండల అధ్యక్షులు ఎలిసోజు నరేష్, గంట అమరేందర్‌రెడ్డి, మైనార్టీ సెల్ చైర్మన్ మహమూద్‌అఫీస్,ఎంపీటీసీ జుమ్మిలాల్, కౌన్సిలర్ భాస్కర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పేరాలవీరేశ్, చింతకాయల సుధాకర్,వార్డుసభ్యులు నర్సయ్య, గ్రామశాఖ అధ్యక్షులు ఎల్లాంల నాగరాజు,ఎల్లయ్య, నర్సయ్య, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలి



• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

సమాజంలో కులాలకు మతాలకు అతీతంగా ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు.పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎంవీఎన్ భవనంలో నిర్వహించిన కేతెపల్లి మండలం కాసనగోడు గ్రామ ముదిరాజ్ కులానికి చెందిన నవీన్, ఉపేంద్రల ఆదర్శ వివాహంలో ఆయన మాట్లాడారు. సంప్రదాయాలు, కట్టుబాట్ల పేరుతో జరుగుతున్న పెండ్లిండ్ల కన్నా ఆదర్శ వివాహాలు గొప్పవన్నారు.ఆదర్శ వివాహాలు జరిగితేనే వరకట్నం పేరుతో జరుగుతున్న దురాచారాలను అరికట్టవచ్చన్నారు. సమ సమాజ స్థాపన జరగాలంటే కులాంతర, మతాంతర, ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట గోపి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం. రాంబాబు,సీపీఐ(ఎం) జిల్లా నాయకులు చినపంగు నర్సయ్య, నాయకులు ఎల్లయ్య, స్వామి,సైదులు, చిరంజీవి, అంతటి నాగేష్ ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-పెన్‌పహాడ్



మండలంలోని మాచారం పంచాయతీ ఆవాసం అనిరెడ్డిగూడెం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం నిర్వహించే 16 రోజుల పండుగకు ఆదివారం విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామములో గ్రామ దేవతలు ఎంతో ముఖ్యమని ప్రజలు భక్తి భావం కలిగి దైవ అనుగ్రహ పొందాలని ఆయన అన్నారు. అనంతరం గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌కు భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, పీఏసీఎస్ చైర్మన్లు వెన్న సీతరాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, మామిడి అంజయ్య, అనిరెడ్డి వెంకటరెడ్డి, ముదిరెడ్డి రంగారెడ్డి, మురారెడ్డి, మదన్మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దొంగరి యుగంధర్, నాయకులు తూముల ఇంద్రసేనారావు, పొదిల నాగార్జున, ఎంపీటీసీ నాగు నాయక్, వెన్న గోపిరెడ్డి, గుజ్జుం అమృతరెడ్డి, యగ్గడి మురళి, టిఆర్ఎస్వి మండల అధ్యక్షులు బోల్లక లింగయ్య, రవీందర్ నాయక్, షఫీ, జగన్, వగ్గు గోపి, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాయపూడి ఉదయలక్ష్మీ సేవలు మరువలేనివి



నవతెలంగాణ-కోదాడరూరల్

రాయపూడి ఉదయలక్ష్మి సేవలు మరువలేనివి అని బీఆర్ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన రాయపూడి ఉదయలక్ష్మి సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎర్నేని వెంకటరత్నంబాబు, డీసీసీబీ మాజీ చైర్మెన్ ముతవరపు పాండురంగారావులతో కలిసి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన శ్రద్ధాంజలి కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దశరథ నాయక్, పైడిమర్రి వెంకటనారాయణ, నాగేంద్రబాబు, శ్రీనివాస్‌రెడ్డి, కుక్కడప్పు బాబు, దండా వీరభద్రం, రాయపూడి చిన్ని, వెంపటి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీఐ బ్యాంక్ సమీపంలో మంటలు

• బ్యాంకుకు తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-హుజూర్‌నగర్



హుజూర్‌నగర్ పట్టణంలోని ఎస్బీఐ బ్యాంక్ సమీపంలో మంటలు చెలరేగిన సంఘటన ఆదివారం జరిగింది. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో ఉన్న చెత్తను గుర్తుతెలియని వ్యక్తులు తగలబెట్టారు. ఆ మంటలు విస్తరించి బ్యాంకుకు అతి సమీపంలో ఉన్న డబ్బా కొట్టుకు అంటుకోవటంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో విషయం తెలుసుకున్న బ్యాంకు సెక్యూరిటీ ఆర్మీ గార్డ్ రాజేష్ బ్యాంకులో ఉన్న మోటార్ ద్వారా నీళ్లను కొడుతూ మంటలను విస్తరించకుండా ఆపగలిగారు. ఫైర్ స్టేషన్ ఎస్ఐకి ఫోన్ చేయగా వేరే మండలంలో మంటలు ఆర్పటానికి అగ్నిమాపక యంత్రం వెళ్ళినట్టు తెలిపారు. స్థానికులు మున్సిపాలిటీకి సమాచారం ఇవ్వగా మున్సిపాలిటీ సిబ్బంది వాటర్ ట్యాంక్ పంపించగా మాటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. దీంతో ఎస్బీఐ ప్రమాదం తప్పడంతో స్థానికులు, బ్యాంకు ఖాతాదారులు సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.



గాలి వానకు కూలిన ఇండ్లు

తుంగతుర్తి:తుంగతుర్తి మండలపరిధిలోని అన్నారం గ్రామంలో శనివారం సాయంత్రం కురిసిన గాలివానకు మిట్టగడుపుల విజయ్‌కుమార్‌కు చెందిన ఇంటిగోడలు పైకప్పు కూలి ఇంటిలోని సామగ్రి అంతా పూర్తిగా ధ్వంసమైంది.తనకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించుకున్నారు.

బీఆర్‌టీయూ పట్టణ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్‌టీయూ అనుబంధ తోపుడుబండ్లు, పండ్లు, కూరగాయలు, పూలబండ్ల యూనియన్ నూతన కార్యవర్గాన్ని కమిటీ ఆదివారం ఎన్నుకున్నారు.అధ్యక్షునిగా దాసరి ప్రకాష్, కార్యదర్శిగా దయామణి ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, బీఆర్‌టీయూ నియోజకవర్గ అధ్యక్షులు గౌరిచర్ల సత్యనారాయణగౌడ్, నాయకులు సంకేపల్లి నరోత్తంరెడ్డి, కందుకూరి నాగార్జున,మహేశ్వరం సందీప్‌నేత, కార్యవర్గ సభ్యులు రాణి,రేణుక,కవిత, ,ఉపేంద్ర, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

•టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్.రాములు

నవతెలంగాణ-సూర్యాపేట

ప్రభుత్వం చొరవ చూపి ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ .రాములు డిమాండ్ చేశారు.ఆదివారం స్థానిక టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు.పాఠశాలలను తెరిచే నాటికి పుస్తకాలతో పాటు ఏకరూప దుస్తులు ఇవ్వాలని కోరారు.విద్యార్థులకు ఇచ్చే మధ్యాహ్న భోజన రేట్లను పెంచాలని, వంట వాళ్లకు ఇచ్చే గౌరవవేతనం పెంచాలని కోరారు.అన్ని పాఠశాలల్లో నెలకొన్న మౌలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.సోమయ్య ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్,ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసరెడ్డి, కె.అరుణ భారతి, కోశాధికారి జి.వెంకటయ్య,జిల్లా కార్యదర్శులు ఎస్‌కె.సయ్యద్,బండి.పాపిరెడ్డి,ఎన్.నాగేశ్వర్‌రావు,వి.రమేష్,బి.ఆడమ్,ఆడిట్‌కమిటీ కన్వీనర్ ఎన్.సాంబయ్య,సభ్యులు టీఏ.జనార్దన్‌రావు,పల్లెఅనిల్‌కుమార్, బాలే.ఆనంద్, రాంపల్లి.శ్రీను బి.ఆనంద్,బి.పిచ్చయ్య ఎం.రవీందర్,ఎన్.సైదా,కృష్ణయ్య ఏలే.శీనయ్య ఆర్.శ్రీనయ్య,బచ్చయ్య వెంకటేశ్వర్లు తదతరులు పాల్గొన్నారు.

స్కూళ్లలో వెంటనే వర్కర్స్‌ను నియమించాలి

నవతెలంగాణ-చివ్వెంల



రాష్ట్రంలోని అనేక పాఠశాలలలో 'మన ఊరు మనబడి'(MOMB) కార్యక్రమం ద్వారా మౌలిక వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం పాఠశాలలకు ఒక వర్కర్‌ను గాని, స్వీపర్‌ను కానీ నియమించకపోవడం శోచనీయం. కరోనాకు ముందు స్కావెంజర్ అనే పేరుతో అనేక పాఠశాలలకు ఒక వర్కర్‌ను నియమించారు.కరోనా సమయంలో తొలగించి నేటివరకు ఇంకా నియమించలేదు.దీంతో పాఠశాల నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు భారంగా మారింది. పిల్లలతో పాఠశాలను, తరగతి గదులను శుభ్రం చేయించకూడదు...ఉపాధ్యాయులు చేయకూడదు. చేస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.ఇటీవల గ్రామపంచాయతీలకు ఈపనిని అప్పగించినప్పటికి, ఎన్నో సార్లు పిలిస్తే కానీ వాళ్ళు రావడం లేదు.అది నెలలో రెండు - మూడుసార్లకు మించిరాదు. వచ్చినప్పుడు కూడా వారు మరుగుదొడ్లు శుభ్రం చేయడంలేదు.మరి ఉపాధ్యాయులు ఏమిచేయాలి? ఒకటవ తరగతి విద్యార్థులు మరుగుదొడ్డికి వెళ్లకుండా తరగతి గదిలోనే మలమూత్ర విసర్జన చేస్తే ఎవరు శుభ్రం చేయాలి.మరుగుదొడ్డిలో కూడా చిన్నపిల్లలకు శుభ్రం చేసుకోవడం రావడంలేదు. ఉపాధ్యాయుడు ఏమి చేయాలి.ఈ దశాబ్ది ఉత్సవాల సందర్భంగానైనా ప్రభుత్వం ఆలోచించాలి.విద్యార్థుల తల్లిదండ్రులేమో మరుగుదొడ్లు శుభ్రం చేసే వారు లేరు.మేము మాపిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపమని తల్లిదండ్రులు అంటున్నారు. ఉన్నతాధికారులు మాత్రం పాఠశాలను ప్రతిరోజు శుభ్రం చేయాలి.మూత్రశాలలు దుర్వాసన రాకుండా చూడాలంటూ ఆదేశాలిస్తారు.ఒక్కవారం రోజులు ఉన్నతాధికారులు ఉండే కార్యాలయాలలో కూడా వర్కర్స్‌ను తొలగిస్తే మా బాధలు తెలుస్తాయి. గతంలో ఎప్పుడైనా ప్రతినెలా వేతనాలు ఒకటవ తేదీన వచ్చేవి. ప్రస్తుతం ఎప్పుడు వస్తాయో ఆ భగవంతునికే ఎరుక.ఇటు ఉపాధ్యాయులకు ప్రమోషన్స్ ఇవ్వక, బదిలీలు చేపట్టక, చిన్న చిన్నసమస్యలు కూడా పరిష్కరించకపోవడం వలన మానసిక వేదనకు గురి అవుతున్నారు.పాఠశాలలలో వర్కర్స్ లేనికారణంగా ప్రభుత్వ పాఠశాలలు అన్నా ప్రభుత్వ ఉపాధ్యాయులన్న సమాజంలో చులకన భావన ఏర్పడుతుంది.మన ఊరు మనబడి కార్యక్రమం కింద ఒక్కో పాఠశాలకు లక్షలకొద్దీ ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, అట్టహాసంగా బడిబాట నిర్వహిస్తూ కూడా ఒక్క వర్కర్ ను నియమించక పోవడం అన్యాయం.. సోమవారం నుండి పాఠశాలలు పునః ప్రారంభం. కానీ ఆదివారం వరకు కూడా గ్రామ పంచాయతీ వర్కర్స్ వచ్చి శుభ్రం చేయడంలేదు ప్రధానోపాధ్యాయుడు ఏమి చేయాలి. పైగా గ్రామ పంచాయతీ వారు మాకు పనిభారం ఉంది.వర్కర్స్ తక్కువగా ఉన్నారు మా వల్ల కాదు అంటున్నారు.పాఠశాల అనేది దేశ అభివృద్ధికి మొదటి మెట్టు. ప్రభుత్వ పాఠశాల కనుమరుగయితే పేదవాడికి నాణ్యమైన విద్య అందని ద్రాక్ష అవుతుంది. అందువలన ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి పాఠశాలకు ఒక వర్కర్‌ను నియమించాలని టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు తీకుళ్ళ సాయిరెడ్డి డిమాండ్ చేశారు.



ఆలయ అభివృద్ధికి రూ.50వేల విరాళం

నవతెలంగాణ-పెన్‌పహాడ్

మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాలయ అభివృద్ధికి ప్రైమెడ్ ఫార్మా కంపెనీ అధినేత నాతాల శ్రీనివాసరెడ్డి ఆదివారం రూ.50 వేల విరాళం వారి పెద్ద కుమారుడు నిర్వేధ్‌రెడ్డి పేరున గ్రామ పెద్దలకు అందించారు. ఆలయంలో భార్య భవానితో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ నాతాల జానకిరాంరెడ్డి, సర్పంచ్ మండలి మల్లయ్య, మండలి కృష్ణయాదవ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు సంకరమద్ది శ్రవణ్‌రెడ్డి, నాతాల చినవెంకటరెడ్డి, ఉపసర్పంచ్లు రావిరాల జానకిరాములు, మామిడి నాగయ్య, సంకరమద్ది నాగిరెడ్డి, రూపని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రిభువనగిరి
4
సోమవారం 12 జూన్ 2023



పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-భువనగిరి

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -1 పరీక్ష జరుగుతున్నందున భువనగిరి పట్టణంలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల, జాగృతి డిగ్రీ కళాశాల పరీక్షాకేంద్రాలను కలెక్టర్ పమేలాసత్పతి ఆదివారం తనిఖీ చేసి పరీక్షల నిర్వహణను పరిశీలించారు.గ్రూప్ -1 పరీక్షలో మొత్తం 3644 అభ్యర్థులకు 2380 మంది పరీక్షకు హాజరయ్యారు.1264 మంది గైర్హాజరయ్యారు.పరీక్షకు 65.31 శాతం హాజరయ్యారు.పరీక్షల నిర్వహణ పూర్తి ప్రశాంతంగా నిర్వహించారు.

బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుని మృతి పట్ల సంతాపం

నవతెలంగాణ-మోత్కూరు



తెలంగాణ ఉద్యమకారుడు,ములుగు జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కుసుమ జగదీష్ మృతి పట్ల రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మెన్, బీఆర్ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.2001 నుంచి జగదీష్ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక పోరాట కార్యక్రమాల్లో జగదీష్‌తో కలిసి పాల్గొనడం ఎన్నటికీ మరిచిపోలేనని తెలిపారు.ఆయన అకాల మృతి తనను ఎంతో బాధించిందన్నారు.వయస్సులో చిన్నవాడైనప్పటికీ జగదీష్ నిబద్ధత, చిత్తశుద్ధిని గుర్తించిన సీఎం కేసీఆర్ ఆయనకు జెడ్పీ చైర్మెన, పార్టీ జిల్లా అధ్యక్షునిగా అవకాశం కల్పించారని, పార్టీ బలోపేతానికి కూడా ఎంతో కృషి చేశారని కొనియాడారు.కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



రోడ్డు నిర్మాణ పనులను సందర్శించిన ప్రభుత్వ విప్

- పాత కాంట్రాక్టర్ తొలగింపు కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగింత
- రెండు నెలల్లో పని పూర్తి చేస్తాం

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్

యాదగిరిగుట్ట మండలంలోని మాసాయిపేట, బహుపేట, తాళ్లగూడెం, పెద్ద కందుకూరు గ్రామాలను కలుపుతూ పోయే రోడ్డు నిర్మాణ పనులను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి ఆదివారం సందర్శించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ మాసాయిపేట, బాహుపేట, పెద్దకందుకూరు, తాళ్లగూడెం వాసుల చిరకాల వాంఛ, ఈ నాలుగు గ్రామాలను కలిపే రోడ్డు నిర్మాణాన్ని గత పీఎంజేఎస్‌వై పేస్- 2 లో ప్రతిపాదించడం, మంజూరు కావడం, శంకుస్థాపన చేసుకున్నామన్నారు.అనంతరం కొన్ని కారణాలవల్ల ఇక్కడ ఉన్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదన్నారు.ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ సెక్రెటరీ దృష్టికి తీసుకెళ్లి ఈ పనులు త్వరితగతిన ప్రారంభించడానికి గతంలో ఎవరైతే కాంట్రాక్టర్ దీన్ని పొందారో అతన్ని టర్మినేట్ చేసి కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పజెప్పి త్వరగా పూర్తి చేయాలని గత నెలలో కోరినట్టు తెలిపారు. దానికి అనుగుణంగా కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పజెప్పి, పనులు ప్రారంభించామన్నారు.రోడ్డు పనుల కోసం రూ.289 లక్షలు మంజూరయ్యాయన్నారు.మధ్యలో ఉన్న పెద్ద కందుకూరు వాగుపైన రూ.355 లక్షలతో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. రెండు నెలల్లో ఈ పనులు పూర్తి చేస్తామన్నారు.వర్షాలు, వాగులు వచ్చినప్పుడు పెద్ద కందుకూరు, తాళ్ల గూడెం మధ్య రాకపోకలు నిలిచిపోయేవన్నారు.బాహుపేట, తాళ్లగూడెం వాళ్లు యాదగిరిగుట్టకు రావాలన్న ఈ వాగు వల్ల చాలా ఇబ్బంది ఉండేదన్నారు.ఇప్పుడు ఈ నిర్మాణం పూర్తయితే రాకపోకలకు అంతరాయం ఉండదన్నారు.ముఖ్యంగా ఈ రోడ్డు నేషనల్ హైవేకు కూడా కనెక్టివిటీ ఇస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తోటకూరి అనురాధ బీరయ్య, తాళ్లగూడెం సర్పంచ్ భాస్కర్, గ్రామ శాఖఅధ్యక్షుడు బత్తిని బాలరాజ్, తోటకూరి బీరయ్య, దాతరపల్లి ఎంపీటీసీ ఐలయ్య, మిట్ట వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



నాయీబ్రాహ్మణులను పట్టించుకోని ప్రభుత్వం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-బొమ్మలరామారం

నాయీబ్రాహ్మణులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య అన్నారు.మండలకేంద్రంలో ఉన్న నాయీ బ్రాహ్మణ సోదరులకు బీర్ల ఫౌండేషన్ సౌజన్యంతో షేవింగ్-కటింగ్ కిట్స్‌ను ఆదివారం ఆయన అందజేశారు.అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశం ఏర్పాటు చేసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఏ ప్రభుత్వం అధికారంలోకొచ్చినా నాయీబ్రాహ్మణుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు.మీకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.నాయీబ్రాహ్మణులు రాజకీయాల్లో ముందుండాలన్నారు.పని చేసే నాయకుడికే పట్టంకట్టాలన్నారు.మనమంతా ఐక్యమత్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు.వీరు ఉదయం నుండి రాత్రి వరకు నిలబడి కష్టపడతారు కావున ప్రభుత్వం వెంటనే 50 ఏండ్లకు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేసారు.ఎవరికి ఎక్కడ ఆపద వచ్చినా తాను ఆదుకుంటానన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశ్, సర్పంచ్ మహేష్‌గౌడ్, సీనియర్ నాయకులు భగవంతరెడ్డి, తిరుమల వెంకటేష్‌గౌడ్, రాజేష్ పైలెట్, జూపల్లి లింగం, ఈశ్వర్, ప్రేమ్‌రెడ్డి, రాజిరెడ్డి,మండల నాయకులు,కార్యకర్తలు, నాయీబ్రాహ్మణులు పాల్గొన్నారు.

2కేరన్‌ను విజయవంతం చేయండి

నవతెలంగాణ-చివ్వెంల

చివ్వెంల పోలీస్‌స్టేషన్, గ్రామాలు, మున్సిపాలిటీపరిధిలో గల యువత సూర్యాపేట కొత్త బస్టాండ్ నుండి సద్దలచెరువు ట్యాంక్ బండ్ వరకు ఉదయం 12.06.2023, ఉదయం 6 గంటలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా, పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే 2కె రన్ లో అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్సై విష్ణు ఆదివారం కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎస్పీ రాజేంద్రప్రసాద్,కలెక్టర్ వెంకట్రావ్, ఇతర జిల్లా అధికారులు,పుర ప్రముఖులు పాల్గొంటారన్నారు.

వాలీబాల్,టీషర్ట్ పంపిణీ

నవతెలంగాణ-బొమ్మలరామారం



మండలంలోని మర్యాల గ్రామంలో యువకులకు ఆదివారం మాజీ ఉపసర్పంచ్ ముద్దం శ్రీకాంత్‌రెడ్డి వాలీబాల్,టీషర్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతఆటలలో ముందుండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఈదులకంటి మహేందర్‌రెడ్డి, భిక్షపతి, శ్రీధర్, నవీన్, గ్రామ యువకులు పాల్గొన్నారు

క్రీడలలో ఓటమి భవిష్యత్‌లో గెలుపునకు నాంది

- ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ-ఆలేరుటౌన్



క్రీడలలో గెలుపోటములు సహజమని, ఓటమి భవిష్యత్ గెలుపునకు నాందని ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు.ఆలేరు జిల్లా ప్రజా పరిషత్ క్రీడామైదానంలో మే నెల 27వ తేదీన గొంగిడి మహేందర్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి.గొంగిడి మహేందర్‌రెడ్డి యువసేన అధ్యక్షులు జూకంటి వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రీడలలో రాష్ట్రంలోని హనుమకొండ జిల్లా హైదరాబాద్ జిల్లా జనగామ యాదాద్రి భువనగిరి సిద్దిపేటతో పాటు ఇతర జిల్లాల నుండి క్రీడాకారులు,30 జట్లు హాజరయ్యాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక క్రీడలకు ప్రోత్సాహకం లభించిందన్నారు.క్రీడాకారులకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు.భవిష్యత్‌లో జరిగే క్రీడలకు తన వంతు సహకారం ఉంటుందన్నారు.తీవ్రమైన ఎండలను సైతం లెక్కచేయకుండా క్రీడలలో పాల్గొన్న క్రీడాకారులను,గెలుపొందిన గజ్వేల్ టీంసభ్యులను అభినందించారు.గెలుపొందిన టీంకు కప్పుతో పాటు రూ.60 వేల పారితోషికం అందజేశారు.ద్వితీయ కప్పు ఆలేర్ టీం సభ్యులకు అందజేశారు.క్రీడాకారులను మెమెంటోలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. నార్మాక్స్ మదర్‌డెయిరీ చైర్మెన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ గడ్డమీద రవీందర్, వాయిస్ చైర్మెన్ గాదపాక నాగరాజు, మున్సిపల్ చైర్మెన్ వస్పరి శంకరయ్య,ఆలేరు పీఏసీఎస్ చైర్మెన్ మొగలిగాని మల్లేశం,వాయిస్ చైర్మెన్ చింతకింది చంద్రకళ మురహరి, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు పుట్ట మల్లేశం, గంగుల శ్రీనివాస్,పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కుండే సంపత్,మోటకొండూరు జెడ్పీటీసీ పల్లా వెంకటరెడ్డి, గ్రంథాలయాల డైరెక్టర్ ఆడెపు బాలస్వామి, కొలనుపాక సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్ రెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు బెతి రాములు, రాయపురం నరసింహులు,మొరిగాడి వెంకటేష్,కొలుపుల హరినాథ్, పోరెడ్డి శ్రీనివాస్, సిరమైన వెంకటేష్‌యాదవ్, దాసిసంతోష్, మోర్తాలరమణారెడ్డి, పాషికంటి శ్రీనివాస్,జూకంటి ఉప్పలయ్య, కుళ్ల వెంకటేష్,పత్తి వెంకటేష్, దయ్యాల సంపత్,చిమి శివములు, గుజ్జ అశోక్, వసుపరి శివకుమార్, బైరిమహేందర్, బండ జహంగీర్,బైరపాక ఆనంద్‌కుమార్,పూలశ్రవణ్, క్రీడల నిర్వాహకులు జూకంటి, వెంకటేష్, సుకృత్, పాండు, జలంధర్, మోహన్, పోలార్డు, మహమూద్,క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు ఇట్టా.. పోయేది ఎట్లా..?



- కంకర పోసి వదిలేశారు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- దుమ్ము ధూళితో వాహనాలు

నవతెలంగాణ-ఆలేరురూరల్

ఆలేరు నుండి అమ్మనబోలు వెళ్లే తారు రోడ్డు 10 కిలోమీటర్లు కొత్త రోడ్డు వేశారు ఆలేరు నుండి కోళ్ల ఫారం వరకు నాలుగు కిలోమీటర్లు నరకయాతన ప్రయాణికులు అనుభవిస్తున్నారు. మంతపురి సమీపంలో ఉండే బిక్కేరు వాగు మీద బ్రిడ్జి నిర్మాణం ఏర్పాటు చేసి దాన్ని సరి చేయకుండా మీది కేలి కంకర పోసి వదిలేసారు ఈ కంకర పోసి కనీసం 20 రోజులు అవుతుంది పెద్ద వాహనాలు కంకర మీద వెళుతూ ఉంటే టైర్లకు అటు ఇటు రాళ్లు ఒత్తుకొని పోయి కంకర రాళ్లు మీదికి తేలి ఉండడంతో ద్విచక్ర వాహనాలు ఈ రోడ్డు వెంబడి ప్రయాణం చేయాలంటే నాన్న ఇబ్బందులు పడవలసి వస్తుంది అదేవిధంగా మంతపూరి దుర్గమ్మ గుడి దగ్గర ఒక్కసారిగా రోడ్డు గుంతల మయంగా తయారు కావడంతో రోడ్డు మొత్తం తవ్వి ఒక పెద్ద గొయ్యిలాగా తయారు చేశారు ఈవతలి ఒడ్డు నుండి అవతలి ఒడ్డుకు ద్విచక్ర వాహనం వెళ్లాలంటే కష్టపడి వెళ్లవలసి వస్తుంది ఎదురుగా వచ్చే వాహనాలు అయితే సైడ్ కు తగిలి కంకర మీద పడి తీవ్ర గాయాలు అయినా సంఘటన ఇటీవల జరిగింది .ఆలేరు నుండి కోళ్ల ఫారం వరకు నాలుగు కిలోమీటర్ల రోడ్డు మొత్తం గుంతల మయంగా తయారై వాహనాలు రిపేరుకు వస్తున్నాయి పెద్ద వాహనాల వెనుక నుండి ద్విచక్ర వాహనాలు వెళ్లినట్లయితే దుమ్ము ధూళితో మొత్తం వాహనం నిండిపోయి కొత్త దుస్తులు అన్ని పాత దుస్తులు లాగా తయారవుతున్నాయి బండిమీద ఇద్దరు వెళ్లినట్లయితే కంకర టైర్లకు గుచ్చుకొని పంపుచార్లు అవుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే బ్రిడ్జి మీద పోసిన కంకర ను సమాంతరంగా చేసి తారు రోడ్డు వెయ్యాలి తొవ్విన రోడ్డును వెంటనే పూడ్చాలి.

ప్రయాణం చేయాలంటే చాలా భయంగా ఉంది

సైదాపురం సురేష్ శర్బనాపురం గ్రామస్తుడు



నిత్యం ఆలేరుకు వెళుతూ ఉంటాను బ్రిడ్జి సమీపంలో ఏర్పాటు చేసిన కంకర మీద వెళ్లాలంటే కొద్దిగా బండి స్పీడు వెళ్లినట్లయితే స్కిడ్ అయి పడిపోతానేమో అన్న భయంగా ఉంది వెంటనే తారు రోడ్డు నిర్మాణం చేసి మాకు ఉన్న కష్టాన్ని తీర్చాలి.

నరకయాతనతో ప్రయాణం చేస్తున్న

గడ్డమీది నరేష్ ఉప సర్పంచ్



శర్బనాపురం నుండి ఆలేరుకు రోజు ప్రయాణం చేస్తూ ఉంటాను 6 కిలోమీటర్లు సాఫీగా ప్రయాణం చేసినప్పటికీ నాలుగు కిలోమీటర్లు మాత్రం నరకయాత చూస్తున్న రెండు నెలలకు ఒకసారి బండి రిపేరు వస్తుంది బండి మీద ఇద్దరం ప్రయాణం చేయాలంటే కంకర గుచ్చుకొని పంపుచారులు ఆయన సంఘటనలు ఇటీవల జరిగింది తొందరగా రోడ్డు నిర్మాణం చేపట్టి బాగు చేయాలి.



చంద్రశేఖర్‌ది గొప్ప మనస్సు

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

అనాథలకు ఆశ్రమం కల్పించడం అంటే గొప్ప మనస్సుతో పాటు మానవత్వం నిబద్ధత కలిగిన వారికే సాధ్యమవుతుందని,వర్గాల చంద్రశేఖర్ గొప్ప మనస్సునాయకుడని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు.మండలంలోని పుట్టపాక గ్రామంలో గ్రామ ఉపసర్పంచ్ వర్గాల చంద్రశేఖర్ నిర్మించిన యాదాద్రి అనాథాశ్రమాన్ని ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.సేవా కార్యక్రమాలు చేయాలంటే గొప్ప మనసు ఉండాలన్నారు.అనాథలకు ఆశ్రయం కల్పించాలనే ఆలోచన రావడం, వచ్చిన ఆలోచనలను అమలు చేసినందుకు చంద్రశేఖర్, కుటుంబసభ్యులను అభినందించారు.కన్న తల్లిదండ్రులను పట్టించుకోని ఈ రోజుల్లో అనాథలను చేరదీసి ఆశ్రమం కల్పించడం మానవత్వానికి నిదర్శనమన్నారు.చంద్రశేఖర్ ఆశయం ముందుకు సాగాలని ఆకాంక్షించారు.అనాథల అవసరం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు.ప్రభుత్వం చేయాగా మిగిలిన సేవా కార్యక్రమాల్ని కొన్ని స్వచ్ఛందసంస్థలు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు.ప్రభుత్వం ఇప్పటికే వృద్ధులకు, వికలాంగులకు ఆసరా పథకం కింద పెన్షన్‌లు ఇస్తూ ఆదుకుంటుందన్నారు.ఈ కార్యక్రమంలో మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి,ఎంపీపీ గుత్తా ఉమాదేవి,జెడ్పీటీసీ వీరమల్ల భానుమతి,సర్పంచ్ సామల భాస్కర్,ఎంపీటీసీ మర్రి వసంత,మాజీ జెడ్పీటీసీ బోళ్ల శివశంకర్, బీఆర్ఎస్ నాయకులు నారబోయిన రవి,చండూరు మున్సిపల్ చైర్మెన్ తోకల వెంకన్న,సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు దొంతవానిపెద్దులు, తుమ్మలనర్సిరెడ్డి, గుజ్జ పీఏసీఎస్‌చైర్మెన్ దోడ యాదిరెడ్డి,వైస్‌చైర్మెన్ బ్రహ్మచారి, నాయకులు పిట్ట రాములు,పిట్ట చంద్రయ్య,కేసిరెడ్డి యాదవరెడ్డి,ఐతరాజు గాలయ,కొత్త శ్రీకాంత్, దొంతగోని అమరేందర్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్‌పోటీలలో ఎక్కువ సంఖ్యలో యువత పాల్గొనాలి

- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్

నవతెలంగాణ-భువనగిరి



రాజీవ్‌గాంధీ యూత్ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో ఎక్కువ సంఖ్యలో యువత పాల్గొనాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్ పిలుపునిచ్చారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని బాబు జగ్జీవన్ రామ్‌భవన్‌లో అధ్యక్షులు మంగ ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈనెల 18వ తేదీన జరిగే ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో ఎక్కువ మొత్తంలో విద్యార్థులను, యువకులను పాల్గొనేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాడడానికి ఎన్ఎస్‌యూఐ మద్దతు ఉంటుందన్నారు. కాలేజీ, పట్టణ, మండల, అసెంబ్లీ నూతన కమిటీలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు భిమనపల్లి శివ, మనోజ్ వర్మ, ఆలేరు యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పల్లె సంతోష్ మునుగోడు అధ్యక్షులు రాచకొండభార్గవ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు సురుపంగ చందు, రావులఅనిల్, గడ్డమీదినిఖిల్, జిల్లా కార్యదర్శులు రవీందర్ చౌహాన్, రేగు రమేష్, భువనగిరిఉపేందర్, పాండాల శరత్, ఎండి. మసుద్, నాయకులు బొల్లెపల్లివినయ్, బండారి మణికంఠ, ఎండి.అరిఫ్, కొండోజుసాయి, నోములతరుణ్, శ్యామలసాయి, సిరికొండతేజ, హరీష్ పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్ ప్రారంభించిన బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-బొమ్మలరామారం

మండలం మేడిపల్లి గ్రామంలో బీర్ల ఫౌండేషన్ సౌజన్యంతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు.ఆలేరు నియోజకవర్గ ప్రజలందరికి సేవ చేయడమే లక్ష్యంగా బీర్ల ఫౌండేషన్ పని చేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని సుమారు 170 గ్రామాలకు వాటర్‌ప్లాంట్,వాటర్ క్యాన్లు పంపిణీ చేశామన్నారు.కరోనా సమయంలో ప్రతి గడపకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశామన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోవిందగౌడ్, కాంగ్రెస్ నాయకులు గ్రామశాఖ అధ్యక్షుడు సుర్వి భిక్షపతిగౌడ్, హనుమంతుగౌడ్, కుమార్, రాగిరిభిక్షపతి, జూపల్లిశ్రీకాంత్ పాల్గొన్నారు.

గొర్రెల కోసం పోయిన కాపరుల బాధలు వర్ణనాతీతం

నవతెలంగాణ-ఆలేరుటౌన్



అనంతపురంలో గొర్రెల కోసం పోయిన గొల్ల కురుమలకు, గొర్ల కాపర్లకు జరిగిన ఇబ్బందులపై టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్‌ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య మండిపడ్డారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వం గొల్ల కురుమలను మరోకసారి మోసం చేశారాని తెలిపారు.గొల్ల కురుమల గొర్రెల పేరు మీద డీడీలు కట్టి మూడేండ్లు దాటి, రెండో విడత గొర్రెలు పంపిణీ వరకు వచ్చిందని,ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో నగదు బదిలీ కాలేదని ,గొర్రెలు ఇవ్వలేదని ఆరోపించారు.ఆలేరుకు సంబంధించిన గొల్ల కురుమలు అనంతపురం జిల్లా యాడి గ్రామానికి వెళ్లి మూడు రోజులు అవుతున్నా కేవలం 22 యూనిట్లు మాత్రమే రావడం సరికాదన్నారు. అక్కడ సౌకర్యం లేక రోడ్డున ఉన్నారని తెలిపారు.అక్కడ గొర్రెలు దొరకడం లేదని దొరికిన గొర్లు బాగోలేవన్నారని కాపర్లు వాపోతున్నారన్నారు.వారు తమ బాధలను వీడియో రూపంలో నాకు వంపించారన్నారు.నూర్యాపేట నుండి వెళ్లిన వారిలో ఓ సర్పంచ్ ఫోన్ చేసి అన్నా మాకు ఈ గొర్లు వద్దు.. మేము ఇంటికి వెళ్లిపోతామని చెప్పారన్నారు.ఇది వినగానే చాలా బాధేసిందన్నారు.గొర్ల కురుమలకు, యాదవులకు మునుగోడులో ఇచ్చిన హామీ ప్రకారం నగదు బదిలీ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు.



సీఎన్‌రెడ్డి సౌజన్యంతో వాటర్‌ఫిల్టర్ ప్రారంభం

నవతెలంగాణ-వలిగొండరూరల్

మండలంలోని జంగారెడ్డి పల్లి గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు బీజేపీ జిల్లా నాయకులు సీఎన్‌రెడ్డి సౌజన్యంతో కార్డ్ సిస్టం వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.వాటర్‌ప్లాంట్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షులు పీవీ శ్యాంసుందర్‌రావు, జిల్లా యువ నాయకులు చిట్టెడ్డి అభిజిత్‌రెడ్డి ప్రారంభించారు.ఈకార్యక్రమంలో జంగారెడ్డిపల్లి సర్పంచ్ శివరాత్రి ఎల్లమ్మ,జిల్లా ఉపాధ్యక్షులు దంతూరి సత్తయ్య, మండలఅధ్యక్షులు నాగెల్లి సుధాకర్‌గౌడ్, రాచకొండ కృష్ణ, బొంతభాస్కర్, కాలేరు రామచందర్, ఆవుల భిక్షపతి, సెక్రెటరీ మెరుగు ప్రమోద్‌కుమార్, బుర్ర శ్రీశైలం,బోగారం రాందాస్, చిలకమర్రి రామాచారి, గోగు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అమలు చేయని హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలి



నవతెలంగాణ-మోత్కూరు

9 ఏండ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నో హామీలు అమలు చేయకుండా విస్మరించిందని, దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం ఆర్భాటంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో తమ పాలనలో అమలు చేయని హామీలను కూడా ప్రజలకు చెప్పాలని సీపీఐ(ఎం) మండలకార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు.మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఆ పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు.దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజల సొమ్మును విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏదో సాధించినట్టు ఆర్భాటంగా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. సాగునీటి గురించి గొప్పగా చెప్పుకుంటున్న పాలకులు మోత్కూరు,అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం) మండలాలకు సాగునీరు అందించే బునాదిగాని కాల్వను ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు.ఈ సమావేశంలో పార్టీ గ్రామశాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య,దడిపెల్లి ప్రభాకర్, కొంపెల్లి గంగయ్య, వడ్డెపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-రాజపేట

రాజపేట పట్టణకేంద్రానికి చెందిన పిశిఖ బాలనర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది.దీంతో ఆదివారం ఆమె కుటుంబానికి స్వాతి చికెన్‌సెంటర్ ప్రొపరైటర్ నమిల కేదారిగౌడ్ తన వంతు సహాయంగా 50 కిలోల బియ్యం అందజేశారు.ఈ కార్యక్రమంలో సురేష్, ఫయాజ్, రమేశ్‌గౌడ్, కిరణ్, అవినాష్, ప్రవీణ్, కర్నాకర్, అంజి,భరత్, శివ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో పాడి ఆవు మృతి

నవతెలంగాణ-రాజపేట



రాజపేట మండలంలోని బొందుగుల గ్రామానికి చెందిన గంగరమైన రమేష్ పాడి ఆవు విద్యుద్ఘాతంతో ఆదివారం మృతి చెందింది.పాడి ఆవు విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితుడు వాపోయాడు.తనను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

బీజేపీ పాలనకు చరమగీతం పాడాలి

నవతెలంగాణ-చౌటుప్పల్

బీజేపీ అవలంభిస్తున్న మతతత్వ, నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య అన్నారు.ఆదివారం చౌటుప్పల్ పట్టణకేంద్రంలో కొత్తగూడెంలో నిర్వహించనున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగసభకు చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాల నుండి శ్రేణులు వెళ్తున్న వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండలకార్యదర్శి పల్లె శేఖర్‌రెడ్డి, నాయకులు దుబ్బాక భాస్కర్, చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, మంచాల జంగయ్య, పగిళ్ల మోహన్‌రెడ్డి, పిల్లి శంకర్, బద్దుల సుధాకర్, రామలింగం, విప్లవ్, లింగయ్య, నర్సింహా, రమేశ్, మల్లేశ్, అంజయ్య,భిక్షపతి పాల్గొన్నారు.

గ్యాస్ బండ పేలి ఇండ్లు దగ్ధం

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని ఆజాద్ నగర్‌లోని ఓ ఇంట్లో గ్యాస్ బండ పేలి ఇల్లు దగ్ధమైన సంఘటన ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఎస్‌కే. మీరాబి తన ఇంట్లో టీ కోసం స్టవ్ ఆన్ చేయబోగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో హుటాహుటిన బయటకు వచ్చినట్లు తెలిపారు. అతరువాత గ్యాస్ బండ పేలినట్టు చెప్పారు. దీంతో ఇంటిపై ఉన్న రేకులు పగిలాయి, ఇంట్లో ఉన్న బట్టలు, విలువైన వస్తువులు కాలిపోయాయి. ప్రమాదం జరగగానే వెంటనే బయటకు రావడంతో ప్రాణ నష్టం జరగలేదు. విషయం తెలుసుకున్న స్థానికులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని నీళ్లతో మంటలను అదుపు చేశారు. తీవ్ర నష్టం జరిగిందని తమను ఆదుకోవాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనారోగ్యంతో శారాసి పెద్దలక్ష్మయ్య మృతి

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్

యాదగిరిగుట్ట మండలం సైదాపూర్ గ్రామానికి చెందిన శారాసి పెద్దలక్ష్మయ్య ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు.మృతదేహాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య సందర్శించి నివాళులర్పించారు.కుటుంబసభ్యులకు ప్రగాడసానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ

నవతెలంగాణ-తిరుమలగిరి

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం లయన్ సారంగుల నర్సయ్య 68వ పుట్టినరోజు సందర్భంగా తిరుమలగిరి వాస్తవ్యులు ఎంగోజు ఏకాచారి గత మూడు సంవత్సరముల నుండి క్యాన్సర్‌వ్యాధితో పోరాడుతున్నాడు.అతనికి కూతురు కుమారుడు ఉన్నారు. అతడు హాస్పిటల్స్ లో చూపించుకోవడానికి స్తోమత లేక కుటుంబ పోషణ భారంగా మారి చాలా కష్టాలలో ఉన్నందున వారికి రైస్ బ్యాగ్, కూరగాయలు, ఉల్లిపాయలు, చింతపండు, నూనె, పప్పులు వివిధ రకాల నిత్యావసర వస్తువులు,2016 రూపాయలు నగదు పారితోషికాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు. దాత సారంగుల నరసయ్య ఈ కార్యక్రమాన్ని చూసి వెంటనే స్పందించి లయన్ ఏమోజు మధు క్యాన్సర్ బాధితునికి రూ.5 వేలు అందజేశారు.లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జలగం రామచంద్రన్‌గౌడ్ మాట్లాడుతూ తిరుమలగిరి పరిసర ప్రాంత ప్రజలు,లయన్స్ క్లబ్ సభ్యులు స్పందించి అతనికి సహాయం చేయాలని ప్రతి ఒక్కరిని లయన్స్ క్లబ్ తరపున విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి అయిత శ్రీనివాస్, ట్రెజరర్ డాక్టర్ సురేష్‌కుమార్, లయన్ మంద పద్మారెడ్డి, లయన్ కాకి వెంకట్‌రెడ్డి, లయన్ కృష్ణమాచారి, లయన్ గిరిగౌడ్, లయన్ గణేష్, మధు, నాగేంద్రాచారి, శ్రీనివాస్, లయన్ కే.లక్ష్మయ్య, లయన్ ఇమ్మడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-నాంపల్లి



మండలంలోని స్వా ములవారి లింగోటం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దుబ్బ నరసింహ తమ్ముడు దుబ్బ జగదీష్ అనారోగ్య సమస్యలతో హైదరాబాదులోని ఒక ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం విషయం తెలుసుకున్న రైతుబంధు సమితి నాంపల్లి మండల కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి జగదీష్‌ని పరామర్శించి వైద్య ఖర్చుల కోసం పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మాడెం పెద్దయ్య సతీమణి మాడెం లక్ష్మమ్మ అనారోగ్య సమస్యలతో ఆదివారం మరణించారు. విషయం తెలుసుకున్న ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి అంత్యక్రియల నిమిత్తం 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎంపీటీసీ బెక్కం రమేష్, వార్డు సభ్యులు గడ్డి పుల్లయ్య, గడ్డి జంగయ్య, అన్నపాక ఈదయ్య, బిఆర్ఎస్ నాయకులు నల్లపు వెంకటేశ్వర్లు, నల్లపు పెద్ద మల్లయ్య, నల్లపు చిన్న మల్లయ్య, దుబ్బ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మడివాల మాచి దేవుని పంచమ వార్షికోత్సవం

నవతెలంగాణ-చండూర్

స్థానిక మున్సిపల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన శ్రీ మడివాల మాచి దేవుని పంచమ వార్షికోత్సవం, శ్రీ ఈదమ్మ, రేణుక ఎల్లమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆదివారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మునుగోడు నియోజకవర్గం ఇన్‌చార్జి చలమల్ల కృష్ణారెడ్డి, మహిళల బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వస్తుండగా చూసి వారికి ఎదురు వెళ్లి బోనమెత్తి ఆడపడుచులను ఉత్సాహపరిచారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన కత్తిని చేత పట్టారు. ఈ కార్యక్రమంలో చండూరు కాంగ్రెస్ మున్సిపల్ పట్టణ అధ్యక్షులు వడ్డేపల్లి భాస్కర్‌సాగర్, దేవలయ కమిటీ చైర్మన్ భూతరాజు దశరథ, భూతరాజు దేవయ్య,కోడి గిరిబాబు, కల్లెట్ల మారయ్య సాగర్, ఒంగూరి యాదయ్య, సయ్యద్ జావిద్, కురుపాటి గణేష్, బొమ్మకంటి శేఖర్, మల్లుర్కర్ దేవా, కర్నాటి శ్రీనివాస్, ఇడికూడా నరేందర్, ఇరిగి శంకర్, మాస కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-సూర్యాపే కలెక్టరేట్



తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్ సీ) ద్వారా ఆదివారం సూర్యాపేట పట్టణంలోని సిటీ టాలెంట్ స్కూల్ చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాలను సందర్శించి గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు.పరీక్షాకేంద్రాల్లో తాగునీటి వసతి అందుబాటులో ఉందా లేదా అని గమనించారు.ఎగ్జామ్ హాల్‌లోకి సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేనందున అభ్యర్థులను మెటల్ డిటెక్టర్లలతో క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు.కాగా, ఆయా కేంద్రాల్లో బయోమెట్రిక్ ద్వారా జరిపిన వేలిముద్రల సేకరణ ప్రక్రియ గురించి కలెక్టర్ ఆరా తీశారు.పరీక్షాకేంద్రాల్లోని గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకుఅందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి ముఖ్య పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు.జిల్లాలో 69.07 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 32 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 9170 మంది అభ్యర్థులకు గాను 6334 మంది పరీక్ష రాయగా, 2836 మంది గైర్హాజరయ్యారని వివరించారు.కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లైజనింగ్ అధికారులు ఉన్నారు.

పుల్లూరు ఉపేందర్‌గుప్తాను వరించిన మూడు ప్రత్యేకఅవార్డులు

నవతెలంగాణ-రాజపేట

రాజాపేట మండలకేంద్రానికి చెందిన సామాజిక సేవకులు, సేవా తత్పరులు, నిరంతర అన్నదాత పుల్లూరు ఉపేందర్‌గుప్తాను హైదరాబాదులో ప్రత్యేక కార్యక్రమంలో మూడు ప్రత్యేక అవార్డులతో సత్కరించి అభినందించారు.ఆదివారం ఈ సందర్భంగా వివరాలు తెలిపారు. ఎక్సలెంట్ హంగర్ రిలీఫ్ అవార్డు, లయన్ ఆఫ్ ద రీజియన్ అవార్డు, క్లబ్ ఉత్తమ అధ్యక్షుడు అవార్డులను ఉపేందర్‌కు ప్రకటించారు. ప్రముఖ సామాజిక సేవకులుగా, సేవా తత్పరులుగా, నిరంతర అన్నదాతగా, లక్ష్మీ కటాక్షం లేని సరస్వతీ పుత్రులకు విద్యనందిస్తూ, కరోనా సమయంలో పేదలను, ఆసుపత్రులకు వచ్చిన వారికి, మృతి చెందిన కుటుంబాలకు భోజన వసతి కల్పిస్తూ పేదింట్లో పెళ్లికి పుస్తె, మట్టేలను అందిస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలను ఉపేందర్ గుప్తా చేపట్టడంతో ఆయనను అవార్డులు వరించాయి.ఎస్‌వీ. గ్రూప్ బిల్డర్స్ ఎండి, లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రేటర్ బంజారా అధ్యక్షులుగా పుల్లూరు అనంతలక్ష్మి ఫౌండేషన్ తరపున పుల్లూరు నాగభూషణం జ్ఞాపకార్థం స్వగ్రామమైన రాజపేటలో, హైదరాబాదులో అనేక సేవా కార్యక్రమాలను ఆయన కొనసాగిస్తున్నారు. రాచకొండ డిసిపి మధుకర్ స్వామి, లయన్ సూర్యరాజు, లయన్ ఓబుల్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్ ల్యాండ్స్ బృందం ఈ మూడు ప్రత్యేక అవార్డులను అందజేసి అభినందించి సంతోషం వ్యక్తం చేశారు. మానవత్వానికి ఉపేందర్ గుప్తా నిలువుటద్దంగా నిలిచారని పాల్గొన్నవారు ప్రశంసించారు. రాజపేట మండలంలోని అన్ని పార్టీల నాయకులు, ప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యా యులు పెద్దలు జర్నలిస్టులు, ఉపేందర్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఉపేందర్ గుప్తా సేవలు ఆదర్శనీయమని పలువురు ప్రశంసించారు.

ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షునికి ఘన స్వాగతం

నవతెలంగాణ-డిండి

రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో తెలంగాణ యువతని భాగస్వామ్యం చేయాలనీ కోరుతూ ఎన్ ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా అచ్చంపేటలో సమావేశాన్ని ముగించుకొని హైదరాబాద్ వెళ్తున్న సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో డిండిలో ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు భీముడు నాయక్, ఎన్‌ఎస్ యూఐ రాష్ట్ర కార్యదర్శి పున్న దినేష్, ఎస్సీ సెల్ డిండి మండల అద్యక్షుడు అవుట మల్లేశ్, జైపాల్, కిషన్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు పృధ్వీ, అజయ్, మేహరాజ్, అనిల్, రాహుల్, జహీర్, శివ, ప్రసాద్, వినోద్, శ్రవణ్, అనిల్, శ్రీకాంత్, శ్రీకాంత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్ మార్చి యాత్ర విజయవంతం

చందంపేట : కాంగ్రెస్ పీపుల్స్ మార్చి యాత్ర విజయవంతమైందని, మంచి స్పందన వచ్చిందని పిఏసిఎస్ చైర్మెన్ , పీసీసీ మెంబర్ జాల నర్సింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చందంపేట మండలంలో నక్కలగండి ప్రాజెక్టు కింద భూముల కోల్పోయిన రైతుల అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ అధికారం రాగానే ప్రతి ఒక్క రైతుకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

రైతులకు వెంటనే ధాన్యం డబ్బులు చెల్లించాలి

నవతెలంగాణ-మోత్కూరు

రైతులు అమ్ముకున్న ధాన్యం డబ్బులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీజేపీ మండల నాయకులు దీటి సందీప్ డిమాండ్ చేశారు.ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి నెల రోజులు గడుస్తున్నా డబ్బులు చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు.వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో పెట్టుబడుల కోసం రైతులు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.పెట్టుబడులకు అధిక వడ్డీలకు అప్పు చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు.ధాన్యం అమ్ముకున్న రైతులకు డబ్బులు చెల్లించకపోగా, కొనుగోలుకేంద్రాల్లో ధాన్యం కొనకపోవడంతో నేటికీ కేంద్రాల్లో రైతుల ధాన్యం పేరుకపోయి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతు ప్రభుత్వమని బీఆర్ఎస్ గొప్పలు చెప్పుకుంటుందని, అమ్ముకున్న ధాన్యానికి డబ్బులు రాక,కేంద్రాల్లో ఉన్న ధాన్యం కొనక రైతులు అవస్థలు పడుతున్నా పట్టింపకోవడం లేదన్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.పది వేల సాయం ఇస్తామని సీఎం ప్రకటించినా నేటికీ ఇవ్వడం లేదని, రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకుల్లో రుణాలు పేరుకపోయి బ్యాంకర్లు రైతులకు కొత్త రుణాలు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. రైతులు ఎన్నో సమస్యలతో సతమతమవుతుండగా ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలతో ఆర్భాటం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న పూర్తి ధాన్యం కొనడంతో పాటు రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సూర్యాపేట అభివృద్ధి జగదీశ్‌రెడ్డికే సాధ్యం

హ్యాట్రిక్ సాధించాలని మోకాళ్లపై నడిచిన శశికాంత్

నవతెలంగాణ-సూర్యాపేట

వచ్చే అసంబ్లీ ఎన్నికల్లో మంత్రి జగదీశ్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపు పొందాలని కోరుతూ తమిళనాడులో దక్షిణ భారతదేశంలోని ఎక్కువ మంది విశ్వాసులు దర్శించే వేలంగిని మేరీమాత దేవాలయంలో సూర్యాపేట క్రిస్టియన్ మైనార్టీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు పెద్దపంగ స్వరూపరాణి ఆమె భర్త బీఆర్ఎస్ మైనారిటీ రాష్ట్ర నాయకులు పూర్ణాశశికాంత్‌లు ప్రత్యేకప్రార్థనలు చేశారు.తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం తమిళనాడులోని నాగపట్నంలో గల వారు మంత్రి హ్యాటిక్ సాధించాలంటూ వేలంగిని మరియమాత దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.మంత్రి వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో సూర్యాపేట నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని కోరుతూ ఈ సందర్భంగా పూర్ణ శశికాంత్ కిలోమీటర్ పైగా మోకాళ్ళ మీద గుడి వరకు నడిచారు.అనంతరం ప్రధాన ఆలయంలో మంత్రి కోసం ఫాథర్ జోసెఫ్‌చే ప్రత్యేక ప్రార్ధన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు స్వరూపరాణి మాట్లాడుతూ సూర్యాపేటను చరిత్రలో ఇంతగా అభివృద్ధి చేయలేదని, ఇది జగదీశ్‌రెడ్డికే సాధ్యమైందన్నారు.ఇక్కడ ఏ కోరిక కోరుకున్న తప్పకుండా నెరవేరుతుందని తెలిసి ఇక్కడికి వచ్చామని మంత్రి కోసం ప్రత్యేక ప్రార్ధనలు జరిపించామని ఆమె తెలిపారు.

సాహిత్య రంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

నవతెలంగాణ-కోదాడరూరల్

సాహిత్య రంగా అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది అని శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాహిత్య దినోత్సవ వేడుకలను పట్టణంలోని గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ హాజరై మాట్లాడుతూ......తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు గత తెలంగాణ సీఎం కేసీఆర్ గారి నేతృత్వంలో నేటి తెలంగాణకు గల వ్యత్యాసాలను, జరిగిన అభివృద్ధిని ,ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని, వ్యవసాయం, పరిశ్రమలు, పట్టణాల అభివృద్ధి, గ్రామీణ అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, విద్య, వైద్య రంగాలలో జరిగిన అభివృద్ధి, విద్యుత్, సాగునీటి, త్రాగునీటి, సాంస్కృతిక ,పర్యాటకంగా, క్రీడలపరంగా జరిగిన అభివృద్ధిలపై కవులు కవులు కళాకారులు ఆలోచించాలని ఆయన తెలిపారు. తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సాహిత్య వైభవాన్ని చాటేలా వేడుకల నిర్వహణకు సాంస్కృతిక శాఖ ఏర్పాట్లు చేసింది. రచన, పద్యం, కవిత్వంలో కవి సమ్మేళనాలు నిర్వహించనున్నారు.సాహిత్య దినోత్సవం కోదాడ గ్రంథాలయంలో తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా వ్యాసరచన కవితల పోటీలు నిర్వహించడం అభినందనియం అని అన్నారు. ఎమ్మెల్యే కవులను కళాకారులను సన్మానించారు. ఈ సమావేశానికి గ్రంథాలయ చైర్మన్ రహీం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ కవచం వెంకటేశ్వరరావు , భరత్ రావు, సుబ్బారావు, సత్యబాబు, వెంపటి మధు, ఈదుల కృష్ణయ్య, చందు నాగేశ్వరావు, కట్టబోయిన శ్రీనివాస్ యాదవ్, గుండెల సూర్యనారాయణ, సట్టు నాగేశ్వరరావు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కవులు, కళాకారులు, సాహిత్య వేతలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.